
# గృహహింస నిరోధ చట్టం 2005




రచన, చట్టపరిచయం

**డి. నటరాజ్**

356.426
నటరా.గృహహిం
99911

గృహహింసా నివారణా చట్టం 2005

డి. నటరాజ్

హక్కులు రచయితవి

కవర్ డిజైన్ నటరాజ్


కాపీలకు
డి. నటరాజ్
9-31-6/2, షణ్ముఖప్లాట్స్,
కూరగాయల మార్కెట్టు ఎదురుగా
పిఠాపురంకాలనీ,
విశాఖపట్నం - 530 003
ఫోన్ 0891 - 2509273
మరియు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్

ప్రచురణ
బోధిసత్వ పుస్తకమాల,
విశాఖపట్నం - 3

ముద్రణ
శ్రీశ్రీ ప్రింటర్స్
విజయవాడ - 2
ఫోన్ 0866 2433359

వెల 10 రూ/-

C16980
97911




మంచి భర్తనూ, మంచి కొడుకులనూ
మంచి పౌరులనూ తయారు చేసుకునే తరుణమిదే

కుటుంబ సౌభాగ్యమే దేశసౌభాగ్యం

మంచి కుటుంబం కోసం కృషి చేయడమంటే
మంచి సంఘం కోసం కృషి చేయడమే

**స్త్రీల హక్కులు వర్ధిల్లాలి**

తల్లులు, ముసలమ్మల ఆస్తి తమ పేర పెట్టించుకుని వాళ్ళకి అన్యాయం చేస్తే
కొడుకులు, మనుమలు కూడా శిక్షార్హులే

# ఆఖరి అస్త్రం

ఆకాశంలా పరచా నాహృదయం
సూర్యునిలా నీవొస్తావని
వెలుగురేకలు తెస్తావనుకుంటే
అగ్నిగుండంలా మండుతున్నావేం?

సాగర తీరాన్నై ఎదురుచూశా
అలల గీతమై నీవొస్తావని
సైకత సమీరమవుతావనుకుంటే
పెను తుఫానై కల్లోలం రేపావేం?

ప్రకృతినై వేచివున్నా
నవవసంతమై నీవొస్తావని
జీవితాన్ని చిగురింప చేస్తావనుకుంటే
గ్రీష్మమై జ్వలింప చేస్తున్నావేం?

మూర్ఖత్వాన్ని అమ్మలా క్షమించా నీలో
పరివర్తన కోసం భూమాతలా నిరీక్షించా
నాసహనం నీకు అసమర్ధతగా అనిపిస్తుందా?
నీతో సమరానికి నేనూ సిద్ధం సుమా!

**టి. విజయదుర్గ**
యఱ్ఱగుంట్ల, కర్నూలు జిల్లా
ఫోన్ : 95881946816

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No. . .. ...... ... ...
గచ్చిబౌలి, హైదరాబాద్ - 500032.

Prof **G. Ramachandrudu,** M A , Ph D , D A S , B L ,
Professor of Economics and
Dean, College Development Council
A U , Visakhapatnam -530 003

# FOREWORD

The word 'Woman' includes 'Man' and hence he is part and parcel of a woman There is no man without a woman However, she is not given her due respect and share in the society as well as economy. In addition, in the domestic front she is subject to domestic violence like insult, ill treatment and even beating.

All these because of ignorance, selfishness and malemongorism of man. With these cruel and inhuman deeds, man gets nothing and ultimately goes to hell

Mr Nataraj has well brought out the sad and critical position of the woman in the present day society He has well explained the Act on Domestic Violence 2005 with its usage He requested the public to step forward to help and guide the women who is depressing in the families He encouraged and given a morale to the women and suggested them to get solution with the help of this Act, to make a man better and responsible towards family and make a better future to the entire family

Mr. Natraj, a senior officer of the University is very much concerned about the social oppression. He is more rational and has humanistic values with a philosophical outlook. He has a strong notion to do good to the society and to help the needy. When he was Assistant Registrar in College Development Council, I found all these things in him in his daily duties I wish him all success in his future endeavors.

- Prof. **G. RAMACHANDRUDU**

Dean

# విషయసూచిక


| | |
|---|---|
| ఆఖరి అస్త్రం - కవిత - టి. విజయదుర్గ | IV |
| Forward by Prof G. Ramachandrudu garu | V |
| పుస్తక పరిచయము - ఎమ్.జె. నిర్మలగారు | VII |
| అభినందన - యం.ఎ. వనజ గారు | IX |
| రచయిత మాట - | X |
| అమ్మలూ, అక్క చెల్లెళ్లూ ఇక ఈ గృహహింసలు పడనవసరం లేదు కుటుంబ హింసా నివారణ చట్టం 2005 మీకు అండగా వుంది | 1 |
| అన్నదమ్ములకు అమ్మలకు అక్క చెల్లెళ్ళకు విన్నపం | 13 |
| మేలైన దంపతుల మేలిమి గుర్తులు | 19 |
| రక్షణాధికారుల జాబితా | 23 |
| ఆంధ్రప్రదేశ్ గృహహింసా నిరోధ చట్టం 2005 అమలుపై ఒక చిన్న రిపోర్టు | 24 |
| కొన్ని అభిప్రాయాలు | 27 |

ఎమ్.జె. నిర్మల
రక్షణాధికారిణి,
గృహహింస నిరోధ చట్టం 2005
విజయవాడ
ఫోన్: 9440814461

# పుస్తక పరిచయము

గృహహింస నిస్సందేహముగా మానవ హక్కుల అంశమే. భారతదేశములో గృహహింస విశృంఖలంగా ఉన్నదని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. భారతదేశములో 2/3వ వంతు వివాహితులైన మహిళలు గృహహింసను ఎదుర్కొంటున్నారు. గృహహింస అనగానే భార్యాభర్తల మధ్య జరిగే హింసనుకుంటారు. ఒక గృహములో నివసిస్తున్న ఏ మహిళ అయిన, ఆడపిల్లలు అయిన తండ్రి, భర్త లేదా వారి రక్త సంబంధీకుల ద్వారా ఎదుర్కొంటున్న హింసను గృహహింసగా పరిగణిస్తారు మహిళలు మరియు ఆడపిల్లలు పట్ల జరుగుతున్న హింస ఆ దేశము యొక్క సాంఘిక మరియు న్యాయ సేవలకు మరింత భారముగా ఏర్పడి చివరకు దేశ ఉత్పత్తికి తీరని నష్టాన్ని కలిగించుతుంది.కావున మహిళల పట్ల హింసను అంతమొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంది.

గౌరవనీయులు శ్రీ నటరాజ్ ఎప్పుడు తీరిక లేకుండా ఆంధ్రవిశ్వవిద్యాలయంలో డిప్యూటి రిజిష్టారు (ఎగ్జామ్స్) గా నిత్యము తలమునక లయినప్పటికి వారికి దొరికే అతి స్వల్ప తీరిక సమయమును మహిళల గురించి ఆలోచించి వారికి తొచిన సేవను వారికున్న రచనా సామర్థ్యముతో ఒక సేవ చేయాలన్న తపనే ఈ పుస్తకము "అమ్మలూ అక్కా, చెల్లెళ్ల యిక ఈ గృహహింసలు పడనవసరము లేదు".

మహిళా గృహహింస నిరోధ చట్టము 2005నకు కృష్ణా జిల్లాకు రక్షణాధికారిగా పనిచేస్తున్న నాకు నిత్యము వస్తున్న అనేక కేసుల తీరు తెన్నులు పరిశీలించిన ఈ పుస్తకములో పొందుపరచిన విధముగానే ఉన్నాయంటే ఆశ్చర్యం కలిగిస్తుంది.

మహిళలు అంటే భార్య కావచ్చు, సోదరి కావచ్చు, తల్లి కావచ్చు, వితంతువులైన స్త్రీలు కావచ్చు ఎవరైన గృహహింస ఎదుర్కొంటున్నట్లయితే ఈ చట్టము నిజముగా వారికి "చుట్టమే". ఒక రక్షణ కవచమే.

ఈ పుస్తకంలో నటరాజ్‌గారు పేర్కొన్న ప్రతి అంశము ప్రతి నిత్యము మహిళలకు ఎక్కడో అక్కడ, ఏదో విధంగా ఎదురుపడుతూ సమస్య కళ్లకు కట్టినట్లుగా ఒక అనుభూతిని కలిగిస్తుంది. ఈ పుస్తకము చదువుతున్నప్పుడు ఎవరికైన ఒక భావము కలుగుతుంది, మహిళలు యింత గృహహింస ఎదుర్కొటున్నారా! అని అతిశయోక్తిగా భావించవచ్చు, కాని ఈ పుస్తకంలో హింసా ప్రవృత్తి గురించి పేర్కొన్న ప్రతి అంశము నగ్న సత్యము.

నేను రక్షణాధికారిగా గత ఐదు మాసములుగా పని చేస్తున్నాను. నాకు ఆశ్చర్యము వేస్తుంది, రక్షణ కొరకు ఆశ్రయించే మహిళల సంఖ్య చూస్తే యింత హింస ఉందా? అని చాలా సార్లు నాలో నేనే ప్రశ్నించుకుంటాను. ఏడుస్తూ వచ్చేవాళ్లు, కన్నీళ్ల పర్యంతమై వారి బాధను వ్యక్తపరచేవారు, నిజంగా చూస్తున్న అందరిని కన్నీళ్లు పెట్టిస్తుంది.

ఈ హింసనుండి విముక్తి పొందిన మహిళలు వ్యక్తపరుస్తున్న ఆనందము అందరిలో ఆనంద బాష్పాలు కురిపిస్తున్నాయి. కొన్ని సంవత్సరములుగా వారి తల్లితండ్రులు కలిసి ఉండటం చూడని పిల్లలకు ఈ ఉపశమునము నిజంగా వారి జీవితములో ఆనందం వెల్లి విరుస్తుంటే సంతోషించనివారు లేరు అంటే అతిశయోక్తికాదు.

రచయిత శ్రీ నటరాజ్ గారు చేస్తున్న ఈ చిన్న ప్రయత్నం గృహహింస ఎదుర్కొంటున్న మహిళలకు జీవితము పట్ల ఆశ కలిగించి తీరుతుంది. గృహహింస చట్టాన్ని సులువైన, అందరికి అర్ధమయ్యే భాషలో వారు రచించిన విధానము ప్రశంసనీయము. అంతేకాకుండా హింసా ప్రవృత్తిని కలిగించే వాటిని వివరించిన విధానము మనము నిత్యము చూస్తున్న అంశము, ఒకసారి మనలనందరిని ఆలోచింపజేస్తుంది.

ఈ పుస్తకము బాధిత స్రీలకు ఒక గైడుగా ఉపయోగ పడుతుంది. చట్టంలో అన్ని అంశములు వాడుక బాషలో పొందుపరచబడినవి. ప్రతి ఒక్కరు కూడా ఈ పుస్తకాన్ని చదివి తమ కుటుంబంలో సుఖశాంతులు కలిగించుకుంటారని ఆశిస్తూ మరొకసారి శ్రీ నటరాజ్ గారు ఒక పురుషుడైనను, నిస్వార్ధముగా మహిళల గురించి ఆలోచించి వారి పట్ల ఆయనకున్న కర్తవ్యమును ఈ పుస్తకము ద్వారా వ్యక్త పరచినందుకు మనసారా అభినందిస్తూ అందరు ఈ పుస్తకాన్ని ఆదరిస్తారని కోరుకుంటూ ............ ..

- ఎమ్.జె. నిర్మల

29.3.2007

యం. ఎ. వనజ
ఎడిటర్, తర్జని మాసపత్రిక
1-3-176/35ఎ, సాయిబాబా మందిర్ రోడ్
కవాడిగూడా, హైదరాబాద్ - 80
ఫోన్: 9849488022

# అభినందన

కుటుంబ హింస నుండి రక్షణ చట్టం, 2005 పది సంవత్సరాలుగా మహిళలు చేస్తున్న పోరాట ఫలితం. ఇది అక్టోబర్, 2006 నుండి అమలులోనికి వచ్చిన తర్వాత దీనిపై జరుగుతున్న చర్చలలో స్త్రీలతో పాటు, పురుషులు కూడా ఈ ప్రచార ఉద్యమంలో పాల్గొంటేనే ఈ చట్టం సరిగా అమలవుతుందని మెజారిటి ఉద్యమకారులు భావిస్తున్నారు.

కాని దురదృష్టవశాత్తూ, ఆడవాళ్లు మగవాళ్లను జైల్లో పెట్టించడానికి వచ్చిన చట్టంగానే వ్యతిరేక ప్రచారం జరుగుతున్నట్లు ముఖ్యంగా పురుషులు భావిస్తున్నట్లు మాకు అర్థమయింది. పురుషులలో ఈ చట్టం పట్ల వ్యతిరేకభావం, చట్టంతో వచ్చిన అభద్రతాభావం పోగొట్టడానికి ఇంకా ఎంతో సాహిత్యం రావలసి ఉంది. ముఖ్యంగా పురుషులు ఈ చట్టప్రచారంలో పాల్గొంటే మరింత ప్రయోజనకర ఫలితాలు ఉంటాయి.

నటరాజ్ గారు ఆ పనికి పూనుకున్నందుకు చాలా సంతోషంగా వుంది. నాకు నటరాజ్ గారు ఆరేడేళ్ళుగా పరిచయం. సామాజిక అంశాల పట్ల సున్నిత అవగాహన కలిగిన వ్యక్తి. తను మంచి అనుకున్నదానిని తను పాటించడమే కాక తన చుట్టూ ఉన్న వారితో కూడా పాటింపచేయాలనే దృక్పథం ఉన్న వ్యక్తి. అలాంటి వ్యక్తి కుటుంబ హింసకు వ్యతిరేకంగా జరిగే ప్రచారంలో పాల్గొనడం, నాకు మా మిత్రులకు ఎంతో సంతోషాన్నిచ్చింది. అలాగే ఉన్నత పదవులలో ఉన్నవారు, మేధావులు ఈ చట్టాన్ని సమర్థిస్తే, తమ రచనలు, ఉపన్యాసాల ద్వారా ప్రచారం చేస్తే అది Added Value అవుతుంది. ఆ విధంగా కూడా ఉన్నత పదవిలో ఉన్న నటరాజ్ గారి ఈ ప్రయత్నం మాకు ధైర్యాన్నిచ్చింది.

నటరాజ్‌గారికి అభినందనలు, ధన్యవాదాలు

**- యం.ఎ. వనజ**

**31.3.2007**

# రచయిత మాట

మొదటిసారిగా, 'భూమిక' స్త్రీవాద మాసపత్రికలో, గృహహింస నివారణ చట్టం 2005' గురించి చదివినప్పుడు, స్త్రీల కొరకు యిటువంటి మంచి చట్టం వచ్చినందుకు చాలా ఆనందపడ్డాను. ఈ చట్టం స్త్రీలందరికీ తెలుస్తే ఎంతో బాగుండును కదా! అనిపించింది.

ఆ తరువాత తర్జని పత్రికలో మరిన్ని వివరాలతో వచ్చిన యీ చట్టం చదివిన తరువాత, తర్జని పత్రిక నిర్వాహకురాలు వనజ గారితో మాట్లాడిన తరువాత ఈ చట్టాన్ని, ఈ పత్రికలో ఇచ్చిన సమాచారాన్ని గుదిగుచ్చి, సరళమైన భాషలో ఒక చిన్న పుస్తకంగా వేసి మహిళలకు అందుబాటులోకి తెస్తే బాగుండుననిపించింది. ఇది చాలా అవసరంగా అనిపించింది. తర్జని వనజగారు ఎంతో సానుకూలంగా స్పందించారు. మంచి స్ఫూర్తినందించారు. కృష్ణాజిల్లా కుటుంబ హింసా నివారణా చట్టం రక్షణాధికారి, ఎం.జె.నిర్మలగారు పుస్తకం చదివి మేలైన సూచనలు చేశారు. దయతో ముందు మాట రాసి యిచ్చారు. టి.కృష్ణాబాయిగారూ, నా శ్రీమతి సుజాతగారు రాత ప్రతిలోని అనవసర పేరాలూ, శబ్ద దోషాలు, అతిశయోక్తులూ లేకుండా సరిదిద్ది పుస్తకానికి సమగ్రమైన రూపాన్ని యిచ్చారు. తర్జని పత్రిక సంపాదకురాలు, యీ పుస్తకం యిలా రావడానికి నిండైన స్ఫూర్తినిచ్చిన వనజగారు అభినందన అందించారు. అన్నట్టు యీ చట్టం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో విజయం సాధించిన తొలికేసు ఆమె చేపట్టినదే. మా ఆంధ్రాయూనివర్సిటీ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ప్రొఫెసర్ జి.రామచంద్రుడు గారు దయతో Fore ward అందించారు. ఎంతగానో సాయమందించారు.

స్త్రీలకి ఎంతో వుపయోగకరమైన యీ చట్టాన్ని తీసుకు రావడానికి అహరహం కృషిచేసిన వారు ధన్యులు. స్త్రీలోకం వారికి రుణపడి వుంటుంది. ఈ చట్టాన్ని అమలుపరిచే కృషిలో వున్నవారు పుణ్యాత్ములు. వారిని యావత్‌లోకం నిండుగుండెతో ఆశీర్వదించును గాక!

నిత్యం, మన సమాజం చేత, మన ఆడపిల్లలు పడే రాగింగ్, ఈవ్-టీజింగ్, చైల్డ్‌మాలెస్టేషన్, మేల్‌మాంగరిజం, రేప్, బ్లాక్ మెయిలింగ్ ..... మరెన్నో శారీరక

మానసికబాధలూ, దుండగాలూ, అవమానాలూ, హింసలూ, హత్యలూ, ఆత్మహత్యలూ చూస్తుంటే, జన్మజన్మలకీ వద్దురా బాబూ ఆడజన్మ అని అనిపిస్తుంది. అంత దుఃఖంగా అనిపిస్తుంది ప్రతీరోజూ. చిన్నప్పటినుంచీ చూస్తూనే వున్నా మగాళ్ల ఆగడాలు; అమ్మా, పిన్నీ, అత్తయ్యలూ, మామ్మలూ, అక్కచెల్లెళ్లూ అందరూ మగాళ్ల బాధలు పడలేక విలవిలా తన్నుకుంటున్నవారే. ఎంత ధీరోదాత్తంగా పెంచినా, వుండివుంటే మా అమ్మాయి కూడా యిటువంటి మగపురుగుల వైషమ్యాల బాధలు పడివుండేదే అనిపిస్తుంది నాకు. కాలేజీలూ, పని స్థలాలూ, ఆసుపత్రులూ, మార్కెట్లూ, బజార్లూ, రోడ్లూ, సిటీ బస్సులూ ...... ఆడవాళ్ళు ఎక్కడ వుంటే అక్కడ నిత్యం ఏదో ఒక వేధింపులే, చులకన భావాలే. స్త్రీని గౌరవించనివాడు, ఒక స్త్రీకే జన్మించిన తనను తాను యింకేం గౌరవించుకుంటాడు? అమెరికాలో బానిసలుగా చేయబడ్డ ఆఫ్రికన్ నల్లజాతుల వారిలో స్త్రీలూ పురుషులూ యిరువురూ వున్నారు. ఇరువురూ కలిసి అనేక పోరాటాలు చేసి, త్యాగాలు చేసి బానిసత్వాన్ని నిర్మూలించి, ధీరమానవతా పతాకను ఎగురవేశారు. మరి మన మగవాళ్లు వీరేం బానిసలో, తమలో సగం అయిన ఆడవాళ్లని తమకు అన్నం పెడుతున్న వాళ్ళని పీడించుకు తింటున్నారు.స్త్రీలని హింసించడం మగవాడికి తలవంపులు, దేశానికే అవమానం అని వీరికి ఎప్పటికి అర్థం అవుతుందో. అలా తెలియజెప్పే షాక్స్ వారికి అందరూ యివ్వాల్సిందే. మంచి సమాజాన్ని ఎవరో మనకోసం రూపొందించి యివ్వరు. దీనిని మనం తయారు చేసుకోవలసిందే. మంచి భావాలూ, చట్టాలూ, సాంఘిక స్పృహకల్గించే రచనలూ యిందుకు ఎంతో వుపయోగపడతాయి. ప్రజలతో మమేకం చెందడం, ప్రజా సంఘాలలో ప్రజల కొరకు పనిచేయడం ... యివి జీవితాన్ని మేలుగా, విశాలంగా, ఆదర్శవంతంగా, బాధ్యతా యుతంగా, ఆనందంగా జీవించేటట్లు చేస్తాయి.

ఈ చిన్న పుస్తకం చదివి, యీ చట్టాన్ని అండగా తీసుకుని బాధిత స్త్రీలు, సోదర స్త్రీ పురుషులు, ప్రజా సంఘాల కార్యకర్తలు మంచి కుటుంబ నిర్మాణం కోసం, తమయొక్క, తమతోటి వారి కుటుంబాల యొక్క స్వేచ్ఛా సుఖ సంతోష ఆత్మగౌరవాల కోసం ముందుకు రావాలని కోరుతున్నాను.

తప్పు చేస్తే పిల్లల్ని మందలించినట్లు భర్తని కూడా మందలించవలసి వుంది. సరైన దారిలో పెట్టుకోవలసి వుంది.

మానవాళి సుఖశాంతులకు మంచి కుటుంబమే గట్టి పునాది. ఆ పునాదిని గట్టిగా ఏర్పరచుకోవడంలో తప్పేముంది?

స్త్రీలు యీ చట్టాన్ని అండగా చేసుకుని, మంచి కుటుంబాన్ని ఏర్పచుకోదలచినప్పుడు, ప్రతివాదుల చేత ఎన్నో విమర్శలు, సహాయ నిరాకరణలు, నిందలు.... యిలా ఎన్నింటినో ఎదుర్కోవలసి వుంటుంది. స్త్రీ కోరేది సత్యమే అయినందువల్ల, మంచే అయినందువల్ల వారు యిటువంటి వాటికి భయపడనవసరం లేదు. తరువాత, తరువాత, 'ఆనాడు నీవు చేసిన పనే మంచి పని' అని అప్పుడు వ్యతిరేకించిన వారే ఒప్పుకుంటారు.అభినందిస్తారు. కృతజ్ఞతలు తెలుపుకుంటారు. ఈ చట్టాన్ని ఉపయోగించడం మంచిపనే అని వ్యతిరేకించిన వారందరూ ఏదో ఒకనాటికి, లేదా వెంటనే ఒప్పుకుంటారు. ఒప్పుకోక తప్పదు. ఎందుకంటే కుటుంబపు బాగులోనే వారి బాగు కూడా వుంటుంది కదా! ఈ పుస్తకం అందరికీ వుపయోగపడుతుందని, స్త్రీలోకం దీనిని ఒక సమాచార ఆయుధంగా స్వీకరిస్తుందనీ నమ్ముతున్నాను.

ఈ చట్టం ద్వారా ఏ స్త్రీ కన్నీరు తుడుచుకున్నా అది గొప్ప విజయమే. అప్పుడు ఆ విజయంలో, ఆ కృషిలో ఏదో ఓ మూలన నేనూవున్నాను కదా అని ఎంతో ఆనందపడతాను.

మంచి సమాజం, మంచి భవిష్యత్తు.. ........... అన్నీ మన చేతుల్లోనే వున్నాయి. చేయకూడనిది ఆలస్యమే.

ఈ పుస్తకం యిలా మీ ముందుకు రావడానికి వితరణ కూడా అందించిన మాన్యులు ప్రొఫెసర్ జి.రామచంద్రుడు గారికీ, మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డి.నాగేశ్వరరావుగారికీ, మా ఆంధ్రాయూనివర్శిటీ హోమియో డిస్పెన్సరీ వైద్యులు డాక్టర్ జి.ఎ.వి.రామేశ్వర్ గారికీ నా కృతజ్ఞతలు, వందనాలు తెలుపుకుంటున్నాను.

ఈ పుస్తకాన్ని అందంగా ఆకట్టుకునేలా ముద్రించిన శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ వారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మంచికవితనందించిన సోదరి టి.విజయదుర్గకు నాప్రత్యేక కృతజ్ఞతలు - ఆశీస్సులు.

ఈ పుస్తక ప్రచురణలో తోడ్పాటునందించి పాలుపంచుకున్న వారందరికీ పేరుపేరునా నాకృతజ్ఞతలు. ఆశీస్సులు. బుద్ధభగవానుని బోధనలు వారికి అండగా వుండుగాక !

- డి. నటరాజ్

27.6.2007

# అమ్మలూ, అక్క చెల్లెళ్లూ
## ఇక ఈ గృహహింసలు పడనవసరం లేదు
## కుటుంబ హింసా నివారణా చట్టం 2005
## మీకు అండగా వుంది.

స్త్రీ, లేకపోతే పురుషుడు లేడు. ఇంకా మామూలు మాటల్లో చెప్పాలంటే, ఆడది లేకపోతే మగాడు లేడు.

స్త్రీ, పురుషుడికి జన్మనిస్తుంది. పెంచి, పెద్ద చేస్తుంది. తాను తినకపోయినా అతడి కడుపునింపుతుంది. గుడ్డలు వుతుకుతుంది. స్నానం చేయిస్తుంది. చదివిస్తుంది. సంఘంలో మనిషిగా తీర్చిదిద్దుతుంది. మంచి అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తుంది. పురుషుడు, అతడు భర్త అయినా, కొడుకు అయినా, తండ్రి అయినా, అన్నదమ్ముడైనా, అల్లుడైనా అతడి సుఖశాంతుల కొరకు అనుక్షణం విశ్రాంతి లేకుండా కృషి చేస్తుంది. ఇలా పురుషుడ్ని ఒక స్థాయికి తీసుకు వచ్చేవరకు ఆమె ఎన్నో బాధలు పడుతుంది. అవమానాలు పడుతుంది. దూషించబడుతుంది. అయినా ఆమె లెక్క చెయ్యదు. ఆమె వుద్దేశంలో మగాడు బాగుంటే చాలు, అతడి నీడలో ఆడది సుఖంగా బ్రతకగలదు. కానీ నిజంగా ఆమె సుఖంగా బతుకుతూ వున్నదా? ఆమె చేసే సేవకూ, యింటి చాకిరీకీ ఏమైనా ఫలితం వుంటున్నదా? చిన్నపాటి మెచ్చుకోలు అయినా వుంటున్నదా??

సావిత్రి అనే కవయిత్రి చెప్పినట్లు, యింతపని చేసినా స్త్రీకి ఏమి దక్కుతోంది? (ఈమె లోకం విడిచి వెళ్లిపోతూ, ఈ దేహం వృధాకాకూడదు, ప్రయోగాల నిమిత్తం దీనిని వైద్య కళాశాలకు యివ్వండి అని చెప్పి మరీ వెళ్లిపోయింది).

"ఉపాధి లేదు, జీతం రాదు
శెలవులు లేవు
సేద దీర్చే నెలవే లేదు
డ్యూటీలున్నయ్, ఓటీలున్నయ్
సూటీపోటీ మాటలు వున్నయ్

బోరుకొట్టే యీ చాకిరీకి
బోనసు లేదు
ఏవేవో కబుర్లు తప్పించీ
ఎక్స్‌గ్రేషియా లేదు
అయినా ప్రచారసాధనాలూ అందరూ
కూడా అంటారు.
'నేను పనిలేని దాన్నని'
భాషే రాని బడుద్దాయిలు అంటారు,
'భారమెంత వహిస్తున్నా నేనే భార్యనని'

ఇలా మగాడి జీవితోన్నతికి అనుక్షణం కష్టపడుతూ, వండి వార్చుతూ యింటి పనులూ, ఆఫీసు పనులూ యిన్నిన్ని చేస్తూ, ఎంతో సహాయకరంగా వుంటూ, మగాడి బతుకును చక్కదిద్దుతూ, యిల్లే తన స్వర్గంగా భావిస్తూ, యింటికి దీపంగా వుంటున్న స్త్రీ, నేడు ఏ పురుషుని కోసమైతే తన జీవితాన్ని అర్పిస్తున్నదో ఆ పురుషుని నుంచే ఆమె కనీస గౌరవం కూడా పొందలేకపోతున్నది. తనను కన్న వాడి దగ్గర నుంచి, తాను కన్నవాడి వరకూ అందరూ ఆమెను ఏదో ఒక విధంగా ఏడిపించే వాళ్ళుగానే తయారవుతున్నారు. అంతగా ఆమె అలుసైపోయింది.

బాల్యంలో, చదువుకొనే వయసులో, గృహిణిగా, తల్లిగా,సంరక్షకురాలుగా వున్న వయసుల్లో, వృద్ధాప్య దశలో...... యిలా అన్ని జీవిత దశల్లోనూ, పురుషులైన భర్త, కొడుకులు, తమ్ముళ్ళు, అన్నలు, తండ్రులు, మామగార్లు, మామయ్యలు, బాబాయిలు, మరుదులు, బావగార్లు, వేలువిడిచిన వాళ్ళంటూ వచ్చికూర్చునే వాళ్ళు, ఇరుగు-పొరుగు, వీధిలోనివారు, బంధువులు, సహ విద్యార్థులు, సహప్రయాణికులు, సహోద్యోగులు ............ యిలా అందరూ, అవకాశమొస్తే చాలు, ఆమెను నిందించడానికీ, వేధించడానికీ, తక్కువ పరచడానికీ, ఏదో ఒక విధంగా తమ స్వార్థానికి వుపయోగించు కోవడానికే సిద్ధంగా వుంటారు.

ఇంటి మగాడు మనిషిగా ఆలోచించి, తన జీవితం బాగు కొరకు, తన పిల్లల భవిష్యత్తు బాగుకొరకు అనుదినం కష్టపడుతున్న, సాయపడుతున్న అక్క, చెల్లి, భార్య, అమ్మ............ వీరి శ్రమలను గుర్తించి గౌరవిస్తే, ఆమె ఆరోగ్యం, విద్య ఆలనాపాలనా,

అభివృద్ధీ ఆత్మతృప్తీ చూసుకుంటూ, ఆమె కష్టంలో భాగం పంచుకుంటూ వుంటే, స్త్రీ అదే గొప్పగా ఎంతో సంతోషపడుతుంది. ఆ బలంతో, ఆ ఆత్మ విశ్వాసంతో ఆమె యింట్లోనూ, యిరుగు పొరుగు, బంధువుల దగ్గర, చదువుకునే చోట, పని చేసే చోట ఎదురయ్యే చీకాకులను, కష్టనష్టాలనూ, సంకుచిత బుద్ధులు కల మగవాళ్లనూ ధైర్యంగా ఎదుర్కొంటుంది. మొదట యింట్లోనే ఆమెకు గౌరవం యివ్వకుండా, ఆమెకు యింటి చాకిరీ-వంటిల్లూ తప్ప, తమకు సేవలు చేయడం తప్పవేరే పని లేదు అని అన్యాయంగా, డబ్బు కోసం, ఆస్తుల కోసం ఏదో రూపేణా ఆమెను హింసిస్తూ వుంటే, ఆ బాధ ఎవరికీ చెప్పుకోలేక, తనలో తానేకుమిలి పోతుంది. ఎవరికి చెప్పుకున్నా, 'నీలోనే ఏదో లోపం వుంది, అని తిరిగి తననే అంటారన్న లోక భయంతో, యిటు మగవాళ్లు పెట్టే బాధలూ, వేధింపులూ, హింసలూ పడలేక మానసికంగా కృంగి పోతున్న వారూ, బతుకు చాలిద్దామనుకునే వాళ్ళూ, ఏ జబ్బు చేసినా ఎవరికీ చెప్పుకోలేక, ఆరోగ్యం పాడు చేసుకుని కృశించిపోయేవాళ్ళూ మన చుట్టూ యిళ్లల్లో ఎందరో! చాలా యిళ్లల్లో ఆడవాళ్ల పరిస్థితి జైలులో స్త్రీ ఖైదీలకంటే హెచ్చుగా లేదనడంలో సందేహం లేదు. అక్కడ వేళకింత ముద్ద అయినా పడేస్తారు, అక్కడే బెటరనిపిస్తుంది.

ఎంత పని చేస్తున్నా, ఎన్ని సేవలు చేస్తున్నా, ఎన్ని బాధలు, అవమానాలు భరిస్తున్నా, మగాడికి తృప్తి అనేది వుండదు. వేధింపుల్లో, హింసలు పెట్టడంలో, అవమానించడంలో, హీనపరచడంలో అతడు ఎప్పటికప్పుడు కొత్తపద్ధతులు నేర్చుకుంటూ వుంటాడు. తానెన్ని వికృత చేష్టలు చేసినా, అఘాయిత్యాలు చేసినా, కుసంస్కారంగా ప్రవర్తించినా, ఆడది ఎదురు మాట్లాడకూడదు. ఎదురు తిరగకూడదు. బానిసలా అణిగి మణిగి పడి వుండాలి. మగవాళ్లకి సేవలు చేయడంలో ఆమె కృంగి కృశించి, నశించిపోయినా ఫరవాలేదు. ఇదే చాలామందిమగాళ్ళ ధ్యేయమైపోయింది.

అతడికి ఆడవాళ్లు తన మాటలు వినడం లేదేమో, తనని వ్యతిరేకిస్తు న్నారేమోనని చచ్చేంత భయం. ఆ భయం అతడికి, యిలా అన్యాయంగా పీడిస్తున్నందు వల్లనే వచ్చింది. ఆ భయాన్ని చంపుకోవడానికి అతడు సకృత్తుగా ప్రయత్నించడు. పైగా మనసా, వాచా, కర్మణా అనేక కుట్రలు సాగిస్తాడు. మహాభారతంలో శకుని ఒక్కడే. ఇప్పుడు యింటికో శకుని, వీధికో రావణాసురుడు, పేటకో దుశ్శాసనుడు తయారవు తున్నారు. వీళ్ళ దుష్టగుణాలు తలకెక్కిన భర్త అమెను అనేక భౌతిక, మానసిక హింసలు పెడతాడు. తన ముందు ఆమె నోరు కూడా ఎత్తకుండా చేసి, తాను హీరోనని కాలర్

ఎగరేస్తాడు. స్త్రీకి కనీసం మాట్లాడే స్వేచ్ఛ కల్పించి, ఆమెను జ్ఞానయుతంగా ఎదుర్కొనే దమ్ము అతడికి లేదు. శాడిస్టు రోగిలా, క్రూర పెత్తందారులా, దుష్టయజమానిలా పీడించడమే నైజంగా తయారవుతాడు తానూ సుఖపడింది లేదు, శాంతి పొందిందీ లేదు ఎంతో చదువుకున్నవారు, పెద్ద వుద్యోగాలు, మంచిపేరు వున్నవారు సైతం, యిళ్లలోకి వచ్చేసరికి స్త్రీల పాలిట శత్రువుల్లా, యమకింకరుల్లా తయారవుతున్నారు. పచ్చి శాడిస్టుల్లాగా నేరమయమైన బ్రతుకు బ్రతుకుతున్నారు ఇటువంటి మగవాళ్లకి మంచి బోధించే వారు లేరు, బుద్ధి చెప్పే వాళ్లు లేరు, హెచ్చరించే వారు లేరు, అదుపులో పెట్టేవాళ్లు లేరు మహిళల మాటలు అతడు వినడు. పోనీ జగమెరిగిన పెద్దలైనా, అటువంటి మగవాళ్లకి కాస్తంత బుద్ధి చెప్తారూ అనుకుంటే అదీ జరగదు. ఎంత గొప్ప పేరు ప్రతిష్టలు కలవాడైనా, తానూ మగవాడే కనుక, లోపాయకారిగా తానూ ఏదో ఒక విధంగా తన ఆడవాళ్లని ఏడిపించుకు తింటూ వుంటాడు కనుక, ఆడవాళ్ల మీద పెత్తనం వహించడం మగాళ్ళ జన్మహక్కు అనుకుంటాడు గనుక, ఏ మగాడూ తన కొడుక్కి గానీ, అల్లుడికి గానీ, తండ్రి, తమ్ముడు, అన్న, బావ, బావమరిది వీళ్లకు గానీ, స్త్రీని గౌరవించాలి, ఆమె శ్రమని గుర్తించాలి, ఆమె ఆలనా పాలనా చూడాలి, ఆమె బాగుంటేనే మనం బాగుంటాం, ఆమె లేకుంటే జీవితం అల్లకల్లోలమై పోతుంది, వీధుల్లో పడి బతకాల్సిందే,' అని చెప్పడు. బుద్ధిగరపడు. హెచ్చరించడు, దండించడు. పైగా ఆమెను ఏ విధంగా, ఎన్ని విధాలుగా హింసించి, నిందించి, బెదిరించి, ఆశలు చూపి, తన్ని, బంధించి ఎలా ఎలా బ్లాక్‌మెయిల్ చేసి లొంగదీసుకోవాలో చెప్తారు. ఏ స్త్రీ అయినా తన స్థితిని గుర్తించి పురుషుడ్ని ప్రశ్నిస్తే, మిమ్మల్ని అంత సుఖపెట్టాం, యింత సుఖపెట్టాం,' అని చెప్తారు. 'పనిమనిషిని పెట్టాము, గ్యాస్ కొన్నాము, మిక్సీ కొన్నాము, వాషింగ్ మెషిన్ కొన్నాము,' అని దంచుతారు. ఇదంతా ఆమెను వంటింటికి పరిమితం చేయడానికే. ఆ పని యీ మిక్సీవల్ల యింత సులువు, యీ పని యీ యంత్రం వల్ల యింత సులువు అని చెప్పేవారు, నిజంగా అంతసులువే అయినప్పుడు ఆ పనులు తాము చెయ్యరేం? ఏదో ఒక విధంగా ఆమె యింటికీ, మగాడికీ దాసీది అవ్వాలి, లేకుంటే చాలా తెలివిగల దాసీల్ని మెయింటేన్ చేసే పెద్ద దాసీది అవ్వాలి. యిదే మగాడి ఆంతర్యం, తనలాగే ఆమె కూడా స్వేచ్ఛ కోరుకుంటుందనీ, సంఘంలో గౌరవాదరాలు కోరుకుంటుందనీ, తన కాళ్ళమీదతాను నిలబడాలని కోరుకుంటుందనీ బాగా చదువుకొని, పురుషునికి ప్రావీణ్యం వున్న అన్నిరంగాలలోనూ తానూ ప్రావీణ్యం

చూపి, తనను తాను రుజువుపరచుకోవాలనుకుంటుందనీ అతడు కొంచెం కూడా ఆలోచించడు. అటువంటి ఆలోచన తన యింటి ఆడదానికి 'వచ్చింది' అంటే చాలు, బెంబేలెత్తి పోతాడు, ఆ ఆలోచనను మొదట్లోనే తునిమేసేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తాడు. ఆమెను అణిచివెయ్యాలని అంతకంతకూ అతడు వేసే కుటిల వేషాలు, పన్నాగాలు, దౌష్టాలు .....హింసలు.... ... తలచుకుంటే గుండె చెరువవుతుంది బక్కచిక్కిన ఒక ఆడదాన్ని అదుపులో పెట్టుకోవడానికి, యిన్ని కుటిల పన్నాగాలు పన్నాలా? యింత పెద్ద ఎత్తున ఆమెను బానిస సంస్కృతిలో ముంచి వేయాలా? అని ఎంతో ఆశ్చర్యమేస్తుంది ఫలితంగా యీ దేశపు పౌరురాలిగా సకల హక్కులూ వుండి కూడా, ఆమె మగాళ్ళ దుండగాలకు, వాళ్లు పెట్టే ఒడిదుడుకులకు, హింసలకు ఎలా లోనవుతుందో, ఎన్ని నరకాలు అనుభవిస్తుందో చూడండి:

1. తండ్రి లేదా సోదరులు బలవంతంగా చదువు మాన్పించేస్తారు. చదువుకుంటే చెడిపోతావని, పెళ్ళిళ్ళు చేయలేమని, కట్నాలు యివ్వలేమని, యింటి పనులు చేస్తూ, అణగిమణిగి పడివుండమని బలవంతం చేస్తారు.
2. ముక్కు మొఖం తెలియని వాడికి, ఏళ్లు ముదిరిన వాడికి, చెడ్డ చరిత్ర వున్న వాడికి, సకల దురలవాట్లు వున్న వాడికి యిచ్చి బలవంతంగా పెళ్ళిళ్లు చేస్తారు. నిండు జీవితాన్ని అతడి కాళ్లముందు పడేస్తారు. అతడు కొట్టే దెబ్బల్ని భరిస్తూ ఆ నీచుడికి పిల్లల్ని కంటూ అలా ఆమె హతమైపోవాల్సిందే.
3. దురదృష్టవశాత్తూ ఆమెకేమైనా శారీరక లోపముంటే, యిక మగవాళ్ల వికృత సంస్కృతికి హద్దు వుండదు. కుంటిదానా, గుడ్డిదానా, చెవిటిదానా, మూగదానా, మెంటల్‌దానా ..... యిలా అంటూ నిత్యం హేళన చేస్తారు. ఎందుకిలా చేస్తున్నావు, నేనేం తప్పు చేసాను? అని అడిగితే తిడతారు. కొడతారు. మరిన్ని వ్యంగ్యపు మాటలు మాట్లాడతారు చంపేస్తామని బెదిరిస్తారు.
4. పెళ్ళయి అత్తవారింటికి పెళుతుందో లేదో, యింటి చాకిరీ అంతా ఆమె మీద పడవేస్తారు. తాము ఏ పని చేయకపోగా, ఆమె మీద పెత్తనం చలాయిస్తారు. సాయంరారు. ఆమె అక్కడ భయం భయంగా జీవించాల్సిందే తలనొప్పి వచ్చినా, కడుపు నొప్పి వచ్చినా, జ్వరం వచ్చినా అన్నీ ఓర్చుకుంటూ చచ్చినట్లు అన్ని పనులూ చేయాల్సిందే. తిట్లూ, నిందలూ, శాపనార్థాలూ, బెదిరింపులూ పడాల్సిందే. ఆడవాళ్లను యిబ్బంది పెట్టే సందర్భాలలో చిన్న చిన్న తేడాలతో మగవాళ్లందరూ

ఒక్కలాగే ప్రవర్తిస్తారు. ఆమె తన భాద ఎవరికి చెప్పుకున్నా ఫలితం వుండదు అందరూ వినయవిధేయతల పేరుతో కుక్కిన పేనులా, నోరు మూసుకుని, గుడ్ల నీళ్ళు కుక్కుకుని బతకమని హితబోధలు చేసేవారే

5. ఏ కారణం చేతనైనా స్త్రీలు కొడుకుల దగ్గర గానీ, కూతుళ్ల దగ్గర గానీ ఆధారపడివుండవలసివస్తే. ఎంత తొందరగా ఆమెను పంపించేద్దామా అన్న వుద్దేశంతో ఆమెను ఎన్నో యిబ్బందులకు గురి చేస్తారు ఆమె సొమ్ము తిని కూడా అమెకు అన్యాయం చేస్తారు. ఆమె యింటి నుండి వెళ్లిపోయేలా అనేక పన్నాగాలు పన్నుతారు.

6. పిల్లలు కలగలేదన్న కారణంగా దుస్సహమైన సూటిపోటి మాటలు పడుతున్న అభాగ్య స్త్రీలు ఎంతమందో. గొడ్డువి అంటూ, గొడ్రాలివంటూ నేరం చేసినట్టు మాటలతో హింసిస్తారు. లోపం ఎక్కడ వుందో, ఎవరి దగ్గరవుందో డాక్టర్ల చేత పరీక్షలు చేయించరు. ఆమెను అనేక అగచాట్లకు గురిచేస్తారు.

7. భర్త వల్ల సుఖవ్యాధులు, ఎయిడ్స్ వంటి రోగాలు పట్టుకుంటే, దానికి కూడా ఆమెనే నిందిస్తారు. ఆమెను వేరేచోట, పశులపాకల్లో స్టోరు రూముల్లో వుండమంటారు. ఇంట్లో ఏ వసతులూ కల్పించరు. అంటరానిదానిగా చూస్తారు. తల్లీ బిడ్డల్ని విడదీస్తారు. మందులిప్పించరు. అలా కుక్కచావు చావాల్సిందే అంటారు. ఇట్లాంటి పరిస్థితుల్లో ఆ స్త్రీలు ఎంతో భయంకరమైన నరకం అనుభవిస్తూ వుంటారు.

8. ఇళ్లల్లో, స్త్రీలను దండించడం తమహక్కు అంటారు. ఆమె తమకు చేసే సేవల్లో, చాకిరీల్లో ఏ మాత్రం తగ్గుదల కనిపించినా, ఇంటికి భారంగా తయారయ్యావనీ, తిండి దండుగ అనీ అంటూ, మానసికంగా, శారీరకంగా ఎన్నో బాధలకు గురిచేస్తారు. చులకన పరుస్తారు. హీన పరుస్తారు. బెదిరిస్తారు.

9. ఆమెకు సంబంధించిన వస్తువులు, ఆమె పుట్టింటి నుండి తెచ్చుకున్న వస్తువులు, ఆస్తులు, నగలు, డబ్బు...... ఆమెకి అందకుండా చేస్తారు. వాటిమీద ఆమెకు హక్కు లేదంటారు. ఆమెపట్ల సానుభూతిగా వుండే వారిని ఆమె దగ్గరకు రానియ్యకుండా చేస్తారు. ఆమెని ఎవరితోటీ మాట్లాడనియ్యరు. ఆమెను కొడతారు. తిడతారు. గాయపరుస్తారు. ఆకలికి మాడ్చుతారు. నిత్యం ఏదో ఒక విధంగా పీడించుకు తింటూనే వుంటారు.

10. ఆమెకు హాని తలపెడతారు. ఏదో ఒక రోజున తనను వీరు చంపివేస్తారన్న భయం కల్పిస్తారు. ఆ విధంగా చంపుతాం యీ విధంగా చంపుతాం, నీ దిక్కున్నోడికి చెప్పుకో, వాళ్లకింత పారేసి, వీళ్లకింత పారేసి, కేసే లేకుండా చేసుకోగలం... యిటువంటి మాటలు మాట్లాడతారు. ఎలాగ చంపుతామో ఆ విధంగా ప్రవర్తిస్తుంటారు. వాళ్ళ బెదిరింపులకు, భయంతో బానిసలా బెదురు గొడ్డులా బతకమంటారు. ఆమెను బంధిస్తారు. ఒక మూలన రోగిలా తోసివేస్తారు.

11. భర్త ఆమెను లైంగికంగా వేధిస్తాడు. ఆమె ఆరోగ్యంగా వుందో, ఆమెకి యిష్టం వుందో లేదో... యివేమీ చూడడు. ఏ అచ్చటా-ముచ్చటా వుండదు. జంతువు వలె ప్రవర్తిస్తాడు. పైగా ఆమెకి యిది తక్కువ - అది తక్కువ అని నిందిస్తాడు. అక్రమ సంబంధాలు అంటగడతాడు.

12 ఆమె చేత ఆమెకి యిష్టం లేని పనులు చేయిస్తారు. ఆమెకు యిష్టం లేని వుద్యోగాలనీ, వృత్తిపనులని చేయమంటారు. ఆమెను ద్వేషించే వ్యక్తులకు సేవలు చేయమంటారు. పరాయి వ్యక్తులకు లొంగి వుండమంటారు. వ్యభిచరించమంటారు. కుటుంబంలో కొందరు ఆమెను శారీరకంగా కూడా వాడుకో చూస్తారు భర్తకు తెలిసినా అతడేమనడు.

13. పిల్లలు లేరనో, మగ పిల్లలు లేరనో, కులం తక్కువ అనో, కులం తక్కువ వారితో ఆమె పుట్టింటివారికి సంబంధాలు వున్నాయనో, ఆమె తరపువారు సంస్కారవంతులు కారనో, ఆమె తరపు వారికి ఏ యిబ్బందులు వచ్చినా వారికి శీలం లేదనో...... మాటలతో పీడిస్తూవుంటారు. పచ్చి బూతులు తిడుతూ వుంటారు.

14. ఆమెకు యిష్టమైన వ్యక్తుల్ని, ఆమె తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లను, ఆమె బిడ్డలను, లేదా వారి బిడ్డలను కొడతాము, కొట్టిస్తాము, కిడ్నాప్ చేస్తాము తుదముట్టిస్తాము, కేసుల్లో యిరికిస్తాము. ... అని బెదిరిస్తారు. నిఘాలు పెడతారు. మాట్లాడిన వారితో రంకులు కడతారు. ఎవరి యింటికీ వెళ్లనివ్వరు. ప్రతీ దానికీ అనుమానిస్తూ, బ్రతుకే నరకంగా మార్చివేస్తారు.

15. పుట్టింటి వారినుంచే, సాంప్రదాయం ప్రకారమో, కోర్టు వుత్తర్వుల ప్రకారమో ఆమె చేతికి వచ్చిన డబ్బునీ, ఆస్తినీ ఆమెకు దక్కకుండా చేస్తారు. ఆమె అనుమతి లేకుండా ఆ డబ్బుని ఖర్చు చేస్తారు. ఆ డబ్బుపైన ఆమెకు హక్కులేదంటారు ఆమెకూ-భర్తకూ వుమ్మడిగా వున్న ఆస్తిని కూడా ఆమె అనుమతి లేకుండా

బలవంతంగా లాక్కుంటారు. సంతకాలు చేయమని, ఆస్తుల్ని బదలాయించమని లేదా చంపుతామని బెదిరిస్తూ వుంటారు

16 ఆమెకు చెందిన, ఆమె పిల్లలకు చెందిన వస్తువులనూ, స్థిర చరాస్తులనూ, ఆమె అనుభవిస్తున్న యింటినీ ఆమె అనుమతి లేకుండా విక్రయించబోతారు ఆమెకు ఏపాటి ఆధారము కూడా లేకుండా చేయాలని కుట్రలు పన్నుతారు.

17 ఆమెకు హక్కు వున్న యిల్లు, స్థలాలు, గదులు, పోర్షన్లు, పొలం, తోటలు మొదలైన వాటిని ఆమె వుపయోగించుకోకుండా దూరంగా పెడతారు లేదా వాటిని ఆమెకు దూరం చేస్తారు. ఆమెను అక్కడికి వెళ్లకుండా, వాటిని వినియోగించుకోకుండా హద్దులు విధిస్తారు. ఆమెకు విడాకులిస్తామని బెదిరిస్తుంటారు.

18. వరకట్నం గురించి పీడిస్తారు. అత్తగారి ఆస్తిలో వాటాకోరమని సతాయిస్తారు. నిన్నుచంపినా దిక్కులేదు అంటారు. ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపిస్తారు. చచ్చిపోమంటారు. చావడమే మంచిది అంటారు. కావలసిన చోటికి వెళ్లకుండా అడ్డు పడతారు. ఆమె వుద్యోగాలకు, విధినిర్వహణకు అంతరాయం కల్పిస్తారు. ఆమె అనుమతి లేకుండా ఆమెకు చికిత్సలు, మాయలు-మంత్రాల చికిత్సలు చేయిస్తారు. ఆమె ఏ మాత్రం ఎదురు మాట్లాడినా దౌర్జన్యం చేస్తారు. ఆమె బాలిక అయితే, బాలిక అనికూడా చూడకుండా ఆమెను వేధిస్తూ ఆమెపై అఘాయిత్యాలు చేస్తారు. ఆమె కళ్ళముందే వేరొకరితో కాపురముంటారు. రెండవ పెళ్లికి ఒప్పుకోమని ఆమెని బలవంత పెడుతూ వుంటారు. నమ్మక ద్రోహం చేస్తారు. భర్త యిష్టం లేక ఆమె దూరంగా బ్రతుకుతున్నా అక్కడికి వచ్చి ఆమెను బలవంత పెడతారు అత్యాచారం చేస్తారు.

19. ఆమెపై వారెంటువంటి దుష్టపనులకు, అన్యాయాలకు పూనుకుంటారో, తిరిగి అవన్నీ ఆమే తమపై చేస్తోందని ప్రచారం చేస్తారు. చిన్న దానికీ పెద్ద రాద్ధాంతం చేస్తోందంటారు. అసలు ఆమె కారణంగానే తమ యింట్లో శాంతి లేకపోతూందని ఆరోపిస్తారు. కొందరైతే ఆమె వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక, ఆమె తమ దౌష్ట్యాలకు ఎదురు తిరగడం సహించలేక, ఆమె మానసిక ధైర్యాన్ని చెడగొట్టేలా, ఆమెకు మెంటల్ అనీ, పిచ్చి ఎక్కిందనీ, బీపీ రైజయ్యిందనీ, పిచ్చి ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని, రావడం లేదనీ, మతి స్థిమితం తప్పి ఏదేదో వాగుతూందనీ, ప్రచారం చేస్తారు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తోందనీ, తమకు నిద్ర కరవైందనీ విషప్రచారాలు చేస్తారు.

ఇలా పైన చెప్పిన విధంగా బ్రతుకే వ్యధగా అయిపోయిన స్త్రీ జీవితాలెన్నో. మన చుట్టూ అందరూ వున్న అనాధలా అయిపోయింది స్త్రీ మన సంఘంలో.

స్త్రీలనింతలా పీడించే పురుషుడు తానూ ఆ స్త్రీలాగానే దుమ్ము కొట్టుకుపోవడం తప్పించి ఎటువంటి ప్రయోజనమూ సాధించలేడు. సంఘంలో అతడికి దక్కే గౌరవం, మొహమాటపు గౌరవం, భయంతో కూడిన గౌరవమే తప్ప నిండు హృదయంతో యిచ్చే గౌరవం అతడికి దక్కదు

స్త్రీని హింసించి, ఆమెను పోగొట్టుకొని తిండికి మొఖం వాసి, అయిన వాళ్లందరూ మొహాన వుమ్మెయ్యగా, త్రాగుడు, జూదాలకు అలవాటు పడి సంఘానికి భారంగా నేరస్థులుగా బతుకుతున్న వాళ్లెంతమందో! ముష్టి ఎత్తుకుంటూ బతుకుతున్న మగవాళ్లెంతమందో! త్రాగుళ్లు త్రాగిత్రాగి కుళ్ళు కాలవల్లో పడి చస్తున్న వారెంతమందో!

స్త్రీ లేకుండా తాము సుఖంగా బతకలేమనీ, జీవితంలో అభివృద్ధికి స్త్రీ సహకారం ఎంతో అవసరమనీ గుర్తించి, ఆమెలోని సుగుణాలను, తెలివితేటలను, సేవాదృక్పధాన్ని గౌరవించే పురుషులు తాము చేపట్టిన ప్రతీరంగంలోనూ విజయాలు సాధిస్తున్నారు

ఈ సంగతి తెలిసినా, అనేకమంది పురుషులు, అజ్ఞానంతో, దురహంకారంతో, స్వార్ధంతో, తామేం చేసినా చెల్లుతుందనే మదగర్వంతో పైన చెప్పిన అనేక దౌష్ట్యాలను స్త్రీలపై సాగిస్తున్నారు. స్త్రీలకు తండ్రులు, అన్నదమ్ములు, భర్త మామ, బావ, మరుదులు ఎవరివల్లా రక్షణ లేకపోతూంది. పైన చెప్పినవన్నీ స్త్రీల పట్ల నేరాల క్రిందే, హింసల క్రిందే వస్తాయి. యివన్నీ చట్టప్రకారం నేరం. ఇంతకు మునుపు ఏ స్త్రీ అయినా న్యాయం కావాలి అనుకుంటే పోలీసులు, లాయర్లు, కోర్టుల చుట్టూ తిరగవలసి వచ్చేది. విచారణ పేరుతో వారు వేసే అనేక అసభ్య ప్రశ్నలకూ, వారు వుద్దేశపూరితంగా గురికావలసి వచ్చేది. న్యాయం వట్టిమాటే అయ్యేది.

కానీ యిప్పుడు పైన చెప్పినటువంటి బాధిత స్త్రీలకు అండగా, వారి రక్షణ కోసం ప్రభుత్వం కుటుంబ హింసల నుంచి మహిళల రక్షణ చట్టం 2005ను తీసుకు వచ్చింది.

పురుషుల మాయాజాలంలో, దుర్మార్గాలలో చిక్కుకుని చెప్పరాని, బాధలు, హింసలు అవమానాలు పడుతున్న స్త్రీలపాలిట యీ చట్టం, స్త్రీలను కష్టాలలో ఆదుకునే తల్లి వంటిది. స్త్రీ, పీడిన పడకుండానే, కుటుంబ గౌరవం పోగొట్టుకోకుండానే, తనను బాధిస్తున్న పురుషుల్ని సక్రమ మార్గంలో నడిచేలా యీ చట్టం వారిని సరిదిద్దుతుంది.

హెచ్చరిస్తుంది. ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం అండతో బాధిత స్త్రీ, బాధించే పురుషుల నుండి, తన యింట్లో వుండే రక్షణ పొందవచ్చు. ఇందుకోసం ఆమె పోలీసు స్టేషన్‌కి వెళ్లనవసరం లేదు. లాయర్ చుట్టూ తిరగవలసిన అవసరం లేదు.

ఈ చట్టం గురించి ఒక్కమాటలో చెప్పాలంటే, యీ గృహహింసా నివారణ చట్టం, 2005, ప్రభుత్వమే స్వయంగా చేసే సంఘ సంస్కరణ. ఈ చట్టం, స్త్రీలని బాధిస్తున్న పురుషుల్ని డైరక్టుగా తీసుకెళ్లి జైల్లో పడేయ్యదు. శిక్షించదు. ప్రాధమిక విచారణ చేసి ఆయా నిందిత పురుషుల్ని హెచ్చరిస్తుంది. పూచీకత్తు రాయించుకుంటుంది. దానిని కూడా అతిక్రమిస్తేనే అటువంటి పురుషుల్ని నేరస్థులుగా భావిస్తుంది.

పురుషులు అంటే అత్తవారింటివారు మాత్రమే కానవసరం లేదు. పుట్టింటి వారైనా, తండ్రి అయినా, బాబాయిలు, పెదనాన్నలు, మేనమామలూ, అన్నదమ్ములు అయినా సరే, ఆమెని పైన వివరించిన విధాలలో ఏ విధంగా బాధలు పెడుతున్నా ఆ స్త్రీ చట్ట ప్రకారం న్యాయం కోరవచ్చు.

కేవలం బాధిత స్త్రీలే స్వయంగా రక్షణ కోరుకోవాలన్న రూలు లేదు. ఆమె స్వయంగా పూనుకుంటే మంచిదే లేకుంటే అటువంటి అభాగ్యుల పక్షాన ఎవరైనా వ్యక్తులు కానీ, స్వచ్ఛంద సంస్థలు గానీ యిందుకు పూనుకోవచ్చు.

బాధిత స్త్రీ గానీ, ఆమె తరఫున నిలబడే వారు గానీ చేయవలసిందల్లా, ఈ పుస్తకంలోనే యిస్తున్న ఆయా జిల్లా రక్షణాధికారికి ఫోన్ చేయడమే. ఈ చట్టం నిర్వహణ కొరకు ప్రభుత్వం నియమించిన రక్షణాధికారి స్వయంగా పూనుకుంటారు. బాధిత స్త్రీ స్వయంగా తానుండే చిరునామా, పేరు తెలుపుతూ మేజిస్ట్రేటుకి దరఖాస్తు చేసుకోవచ్చు అప్పుడు జిల్లా మేజిస్ట్రేట్ ఆమె రక్షణ కొరకు స్వయంగా పూనుకుంటారు.

స్త్రీపైన హింస అప్పటికే జరిగివుంటుంది లేదా జరుగుతూ వుంటుంది. లేదా హింస, అన్యాయం జరిగే పరిస్థితులు ఎదురుగా వుంటాయి. ఈ మూడు పరిస్థితులలో కూడా బాధిత మహిళ తనను బాధిస్తున్నటువంటి వ్యక్తిపై (ప్రతివాదిపై) ఫిర్యాదు చేయవచ్చు. మరల మరల చెప్పేది ఏమంటే, తనపై కుటుంబహింస జరుగుతూందని బాధిత మహిళ తానే స్వయంగా ఫిర్యాదు యివ్వవలసిన అవసరం లేదు. ఆమె తరఫున ఎవరైనా, ఆ సంఘటన గురించి తెలిసిన వారెవరైనా అంటే యిరుగు పొరుగు వారు, రోడ్డున పోతూ కుటుంబ హింస చూసిన వారు, సంస్థలు ఎవరైనా యీ ఫిర్యాదు చేయవచ్చు. మెజిస్ట్రేటు మొదటి విచారణ తేదీని ప్రతివాది సమన్లు అందుకున్న మూడు రోజుల్లోపలే నిర్ణయిస్తారు

ఆమె మొదటిగా (లేక ఆమె తరపున ఎవరైనా) ఆ ప్రాంతపు రక్షణాధికారికి (చూ పే 34) లేక, ఈ చట్టం క్రింద సేవలందించేందుకు నమోదు చేయించుకున్న సంస్థకు టెలిఫోన్ చేయగానే, రక్షణాధికారిగానీ, వారి దగ్గర తమ సంస్థ పేరు నమోదు చేయించుకున్న స్వచ్ఛంద సంస్థవారు గానీ, ఆమె పేర్కొన్న స్థలానికి వచ్చి, ఆమెకు యీ చట్టాన్ని గురించి ఆమె ఎదుర్కొంటున్నటువంటి పరిస్థితులలో ఆమె ఏ విధంగా ఉపశమనం పొందవచ్చో వారే స్వయంగా వచ్చి వివరిస్తారు.అలాగే యింకా ఏఏ సెక్షన్ల క్రింద ప్రతివాదిపై కేసులు పెట్టవచ్చో కూడా వివరిస్తారు. బాధితురాలి తరపున వారే నివేదిక తయారు చేసి వెంటనే మేజిస్ట్రేట్‌కు అందచేస్తారు. తనకు నివేదిక అందిన ప్రతివాదికి సమన్లు అందేలా జిల్లా మేజిస్ట్రేటు చర్యలు తీసుకుంటారు. సంఘటన నమోదైన నాటినుండి మూడురోజులకల్లా విచారణ ప్రారంభం అవుతుంది ఆమె ఎదుర్కొంటున్న పరిస్థితులలో ఆమెకు ఎటువంటి ఉపశమనం అవసరమైతే అటువంటి ఆదేశాలను ప్రతివాది కోర్టుకు హాజరైనా కాకపోయినా జారీ చేస్తారు. అరవై రోజుల్లో కేసు విచారణ పూర్తి అయి పూర్తి తీర్పు వెలువడుతుంది. ఈలోగా ప్రతివాదిపైన ఆ స్త్రీకి నమ్మకం కలిగితే యీ కేసును ఆమె విత్‌డ్రా చేసుకోవచ్చు ఆమె కోరుకున్నంత కాలం యీ కేసు అమలులోనే ఉంటుంది.

ఈ తీర్పుననుసరించి ప్రతివాది (భర్త లేక యితర మగ బంధువులు) ప్రవర్తించాల్సి వుంటుంది. దీనిని అతడు ఒక హెచ్చరికగా తీసుకొనేలా అతడికి సమన్లు యిస్తారు. ఆదేశాలు యిస్తారు. ఆ ఆదేశాలు ఆమెకు అభయం, రక్షణ కల్గించేటట్టుగా వుంటాయి. ఆమెపైన ప్రతివాదులు ఎలాంటి హింసలకు పాల్పడేందుకు ప్రతివాది (భర్త లేక యితరులు) ఎవరినీ ప్రేరేపించకుండా ఆమె ఉద్యోగం చేస్తున్న చోటికి గానీ, ఆమె చదువుకుంటున్న చోటికి గాని, ఆమె నివాసం వుంటున్న చోటుకి గానీ వచ్చి ఆమెను యిబ్బందులు పెట్టకుండా, ఆమెను ఏ విధంగా కూడా మాటలతో గానీ, చేతలతో గానీ బాధలు పెట్టకుండా ఆమె అనుమతి లేకుండా ఆమె వస్తువులు, ఆస్తులు అమ్మకుండా, ఆమె ధనాన్ని ఖర్చు పెట్టకుండా, ఆమెకు గానీ, ఆమెకు సాయపడుతున్న వారికి గానీ వీరు (ప్రతివాదులు) ఎటువంటి హింసా పెట్టకుండా, ఆమె వుండే యింటిలోకి చొచ్చుకుని రాకుండా (అది ఒకవేళ ప్రతివాది యిల్లు అయినా సరే) ఆమెతో కలిసి వుండే యింటిని అతడు ఆమె అనుమతి లేకుండా మరొకరికి యిచ్చివేయడం, అమ్మడం, ఆక్రమించుకోవడం లాంటి పనులు చేయకుండా, ఆమెకు

గానీ, పిల్లలకు గానీ, ఎటువంటి హానీ తలపెట్టకుండా, బాధితురాలు, ఎదుర్కొంటున్న పరిస్థితిని బట్టి ఏ చర్య అవసరమైతే ఆ చర్యను, ప్రతివాదిపై షరతులతో సహా మేజిస్ట్రేటు కోరవచ్చు. మేజిస్ట్రేటు ఆదేశాన్నిగానీ, తాను యిచ్చిన హామీని గానీ పాటించకపోయే పక్షంలో దానికి ప్రతివాదే బాధ్యత వహించాల్సి వుంటుంది అటువంటి పరిస్థితులలో మేజిస్ట్రేటు ప్రతివాదిని ఆదేశించవచ్చు ఆమెను ఏదైనా రక్షిత స్థలానికి పంపవచ్చు ఇంటి అద్దె, దినసరి యితర చెల్లింపులను ప్రతివాదే భరించాని ఆదేశించవచ్చు. ఆమె ధనాన్ని, ఆమె ఆస్తులనూ ఆమెకు తిరిగి యిచ్చివేయాలని ఆదేశించవచ్చు. ఆమెకు సంపాదన నష్టం, వైద్య ఖర్చులు, ఆస్తిని ధ్వంసం చేస్తే ఆ ఖర్చులు, ఆమెకు ఆస్తి లేకుండా చేయడం వలన వచ్చిన నష్టం, ఆమెకు సంపాదన లేకుండా చేయడం వలన వచ్చిన నష్టం వీటికి ప్రతివాదే పరిహారం చెల్లించాలని ఆదేశించవచ్చు. ఆమెకు ప్రతినెలా భరణం ఇవ్వాలని ఆదేశించవచ్చు. బాధితురాలికి కలిగిన నష్టం, గాయాల వల్ల, మానసిక క్షోభలకు, మనస్తాపాలకు కూడా నష్టపరిహారం, పరువు నష్టాన్ని కూడా ఆయన అతడిపై విధించవచ్చు. ఆపివేసిన చదువును కొనసాగించాలని ఆయన ఉత్తర్వు జారీ చేయవచ్చు. బాల్య వివాహాన్ని నిరోధించవచ్చు.

ఈ ఆదేశాలను ప్రతివాది ఉల్లంఘిస్తే అది చట్టరీత్యా నేరం అవుతుంది. అందుకు అతడిపైన క్రిమినల్ కేసు కూడా పెట్టవచ్చు. ఏడాది వరకూ లేక అంతకంటే ఎక్కువ కాలం అతడికి జైలు శిక్ష విధించవచ్చు. ఇరవై వేల రూపాయల వరకు అతడిపైన జరిమానా విధించవచ్చు. లేకపోతే రెండూ కూడా విధించవచ్చు.

మొత్తం యీ గృహహింసా నిరోధక చట్టం అమలులో రక్షణాధికారి యొక్క లేక స్వచ్చంద సంస్థ నిర్వాహకుల మొక్క బాధ్యతలు, సేవలు గణనీయమైనవి. రక్షణాధికారి లేదా రక్షణాధికారిణి:

1. బాధిత స్త్రీ గురించి హింసా సమాచారం అందిన వెంటనే ఆ ప్రదేశానికి వెళ్లి, ఆమెకు న్యాయ వివరాలు చెప్పి, సంఘటనా నివేదికను చేసి, మేజిస్ట్రేటుకు సమర్పిస్తారు.
2. బాధితురాలు ఫిర్యాదు చేయాలని కోరితే అందుకు సహకరిస్తారు.
3. ఆమె భద్రతకు భద్రతా ప్రణాళికను తయారు చేసి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అధారిటీ ద్వారా, ఆమెకు న్యాయ సహాయం అందిస్తారు.
4. ఆమెకు, ఆమె పిల్లలకు వైద్య సేవల కేంద్రంలో వైద్య సదుపాయం, రవాణా సదుపాయం అందిస్తారు.

5. ఆమెకు పునరావాసం కల్పిస్తారు.
6. ఆమె వేధింపులకు గురికాకుండా, అత్యవసర పరిస్థితులలో వారు పోలీసు వారి సహాయాన్ని కూడా తీసుకుంటారు.
7. మేజిస్ట్రేటు ఆదేశాల్ని ప్రతివాదిచే అమలు చేయించడంలో రక్షణాధికారులు ముఖ్యపాత్ర వహిస్తారు. అతడికి నోటీసులు జారీ చేస్తారు.

ఇన్ని సౌలభ్యాలు వుండటం చేత, యీ గృహహింస నిరోధ చట్టం 2005, దేశ స్త్రీలకు దన్నుగా, రక్షణ కవచంగా వున్నదని చెప్పక తప్పదు ఉపయోగించుకోవడానికి ప్రతి స్త్రీకి హక్కు ఉంది. ఆ హక్కుని కాదనడానికి ఏ మగవాడికీ హక్కు లేదు చెప్పాలంటే యీ రక్షణ చట్టం స్త్రీలని కుటుంబ హింసనుండి రక్షించడానికి మాత్రమే కాదు, స్వార్ధ అజ్ఞాన దురహంకారాలతో, దురలవాట్లతో స్త్రీలను పీడించే పురుషులు తమ వైఖరులు మార్చుకుని, నీతిమంతుడిగా, నాగరీకుడుగా జీవించే అవకాశాన్ని యిచ్చే చట్టం కూడా. ఈ చట్టం వల్ల స్త్రీకీ పురుషుడికీ మేలే గనుక, ఈ చట్టాన్ని బాధిత స్త్రీలు వుపయోగించుకోవాలి, వారు వుపయోగించుకునేటట్లు పురుషులు తోడ్పడాలి. గొడవలు, బాధలు లేక అందరూ సుఖపడాలి. దేశంలోని అన్ని కుటుంబాలూ సుఖశాంతులతో సంతోషంతో జీవించే ఆ రోజు రావాలి. తప్పక వస్తుంది కూడా. ఇందుకోసం, చదువరులు ఎంతో కొంత ప్రయత్నం చేస్తారని మా తలపు.

## అన్నదమ్ములకు ! అమ్మలకు ! అక్కచెల్లెళ్ళకు !! విన్నపం

కనిపెంచినందుకు, సర్వశక్తులు ధారపోసినందుకు, తల్లిగా తనను గౌరవిస్తాడనీ, వృద్ధాప్యంలో బాసటగా వుంటాడనీ నమ్మిన తల్లులు; అతడు తనని భార్యగా, స్నేహితురాలిగా, మంత్రిగా, గృహిణిగా తనను గుర్తిస్తాడు, గౌరవిస్తాడు, రక్షణ కల్పిస్తాడు అని అతనికి బిడ్డల్ని కని, కుటుంబం కోసం తన సర్వ శక్తుల్ని ఖర్చు చేసే స్త్రీలు, అందుకు వ్యతిరేకంగా మాటతప్పిన మగవారినీ, మోసం చేసిన మగవారినీ, వారి యితర మగబంధువులనూ మన్నించవలసిన అవసరం లేదు. వారికి భయపడవలసిన అవసరం లేదు. అంతేకాదు, వారు తన పట్ల, సరిగా, గౌరవమర్యాదలతో వ్యవహరించేలా చేసుకోవచ్చు. గృహహింసా నిరోధక చట్టం 2005, వారికి యిందుకు ఎంతో అండగా వుంటుంది. బాధలు పడుతున్న స్త్రీలు, అటువంటి

వారిని చూస్తున్న స్త్రీలు యిందుకు స్వయంగా పూనుకోవాలి. పూనుకోక తప్పదు లేకుంటే మగాడి దుర్మార్గ రాజకీయాలకు అంతు వుండదు.

స్త్రీల అణచివేతలో ఎంతో కొంత భాగస్వామ్యం వున్న పురుషులెవరూ బాధిత స్త్రీకి యీ విషయంలో సాయం రారు అయితే స్త్రీల గురించి బాధ పడేవారే లేరు అని ఎప్పుడూ అనుకోకూడదు. మనకు తెలియకుండా లోకంలో ఎంతోమంది మంచివారు వుంటారు. మన గురించి తెలిస్తే వారు తప్పక ముందుకు వస్తారు.

స్త్రీలు మొదటగా, 'తాము యీ సంఘంలో విభజించరాని అంతర్భాగం, పురుషులకెలా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, చదువు, వుద్యోగం, ఆస్తిపాస్తులు వున్నాయో తమకూ అవి పొందడానికి హక్కులు వున్నాయి, తమను ఆదరించే స్వచ్ఛంద సంస్థలు, మనుషులు, ప్రభుత్వ సంస్థలు వున్నాయి అని గుర్తించాలి. తాను న్యాయం కోరడంలో ధృఢంగా వ్యవహరిస్తేనే అలక్ష్యం చేస్తున్నవారు కూడా మేల్కొని ముందుకు వస్తారని గుర్తించాలి. నేనూ మనిషినే, రక్త మాంసాలున్న మనిషిని, పురుషులలాగే తానూ సంతోషంగా, స్వేచ్ఛగా, బాధ్యతగా బ్రతికే హక్కు తనకి వుంది, నేను పశువును కాను, బానిసను కాను, యీ దారుణమైన గృహహింసలు తాను పడనవసరం లేదు, 'నేను మేల్కొంటేనే, యితర బాధిత స్త్రీలూ మేల్కొంటారు, పురుష జాతిలో కదలిక వస్తుంది', అని కూడా గుర్తించాలి, ముందుకు రావాలి.

స్త్రీ అయినా, పురుషుడు అయినా ఒక మంచి పని చేస్తే దాని ప్రభావం వృత్తినే పోదు. సంఘం జాగరూకమవుతుంది, తమ తప్పులు తెలుసుకున్న వాళ్ళు తమపై ఫిర్యాదులేవీ రాకుండా మొదట్లోనే సర్దుకుంటారు.

ఈ సంఘంలో ఎవరికీ మరొకరిని బాధించే హక్కు లేదు. సంఘంలో స్త్రీలు - పురుషులు అందరూ ఒకరిపై ఒకరు ఆధారపడి బ్రతుకుతున్నటువంటి వారే. ఒకరు ఎక్కువ - ఒకరు తక్కువ అని అనుకోవడానికేమీ లేదు. అలా అనుకుని లెక్కకడితే, తన సేవలు - తెలివితేటలరీత్యా, స్త్రీయే సంఘానికి పురుషునికన్నా ఎక్కువ సహాయకారి, అన్నది రుజువైన సత్యం. అయితే సాధారణంగా స్త్రీ లెవరూ పురుషునికన్నా ఎక్కువ అనిపించుకోవాలన్న వుద్దేశంతో వుండరు. ఆ వుద్దేశంతో వారువున్నా అందులో తప్పేమీ లేదు. చాలామంది తామూ పురుషులతో సమానమే, మేమూ గౌరవనీయులమే అని గుర్తించాలని కోరుకుంటారు. కాని పురుషుడు తన స్త్రీకి యిటువంటి కనీస గౌరవం-గుర్తింపు యిస్తే తనను మించి పోతుందేమోనని భయపడిపోతాడు. తనకున్న 'కొద్దిపాటి' గొప్పతనాన్నే మహా గొప్పగా చెల్లుబాటు చేసుకోవాలని ప్రయత్నిస్తాడు.

తన విధానాలు, అహంకారాలు చెల్లుబాటు కాకపోతే యిక వారిపైన నిర్బంధం మొదలు పెడతాడు. భార్య అధికంగా చదివినా, అధికంగా సంపాదనపరురాలైనా తట్టుకోలేడు. ఈర్ష్య చెందుతాడు. ఆమె తన భార్య అయినప్పుడు తానెందుకు ఈర్ష్య పడటం?

స్త్రీని తక్కువగా చూడాలనే బుద్ధి, లోకంలోని కొంతమంది నికృష్టులనుంచి తనకు సంక్రమించిన జాడ్యం అని పురుషుడు తెలుసుకోవాలి. న్యాయం ఆలోచిస్తే చాలు ఆ జాడ్యం అదే వదిలిపోతుంది. కానీ చాలామంది అటువంటి జాడ్యంలోనే బతకాలని తలుస్తారు. ఎంత వ్యక్తిత్వహీనమైన విషయం యిది? ఎంత అజ్ఞానం యిది?

స్త్రీలు పురుషులు అన్యోన్యంగా మిత్రులవలె సంతోషంగా వుంటే పిల్లలకూ, లోకానికీ ఎంతో సంతోషంగా వుంటుంది. మానవజాతి సమైక్యత వలననే ఉన్నత నాగరికతలు పుడతాయి. అటువంటి మానవజాతి సమైక్యత మొదటగా స్త్రీ పురుషుల సమైక్యత మీదనే ఆధారపడి వుందని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. స్త్రీలూ పురుషులూ ప్రత్యర్థులవలె, శత్రువుల వలె ఒకరినొకరు పీడించుకుంటూ వుంటే ఏ సంఘమూ బాగుపడదు, ఏ దేశమూ బాగుపడదు. పిల్లలు ప్రేమ, ఆప్యాయతలు, జీవన భద్రత కోల్పోయి, మంచీ చెడూ చెప్పేవారులేక, తీర్చిదిద్దేవారు లేక, దురలవాట్లకు, దుష్ట అహంకారాలకూ లోనై, కుటుంబానికీ, సంఘానికీ చీడ పురుగుల్లాగా తయారవుతారు. దుఃఖిస్తూ, రోదిస్తూ బ్రతుకుతారు. ఏ తల్లీ తండ్రీ కోరుకోవలసిన విషయం కాదిది.

ఇది, గృహహింసా నివారణ చట్టం 2005 పూర్తి నకలు కాదు. ఒక పరిచయం మాత్రమే. ఈ చట్టాన్ని స్వచ్ఛంద సంస్థలు, రక్షణాధికారులు వారే స్వయంగా వచ్చి మరింత వివరంగా అందిస్తారు. ఈ గృహహింసలు, దుష్టులైన మగవారు పెట్టే బాధలు, దురన్యాయాలు తాను పడవలసిన అవసరం లేదని బాధిత స్త్రీ గుర్తిస్తే చాలు. ఫోన్ చేస్తే చాలు ఆ తరువాత ఏం చేయాలో, ఏం చేస్తే బాగుంటుందో రక్షణాధికారులే స్వయంగా వచ్చి వివరాలు అందిస్తారు.

పురుషులందరూ చెడ్డవాళ్లు అని అంటున్నారని, యీ పుస్తకం చదివిన వాళ్ళల్లో కొందరికి అనుమానం కలగవచ్చు. అది కేవలం అపోహ మాత్రమే. స్త్రీని గుర్తించి, గౌరవించి, ఆమె అభిప్రాయాలనూ, మనసునూ తెలుసుకొని, సుఖంగా జీవిస్తున్న వారెందరో వున్నారు. స్త్రీలను కంటిపాపలుగా చూసుకునే పురుషులెందరో వున్నారు. స్త్రీలకు చేదోడు వాదోడుగా వుంటున్న వారెందరో వున్నారు. ప్రేమగా, ఆప్యాయతగా చూసుకునే అన్నదమ్ములెందరో వున్నారు. కానీ అందరూ అలా వుండటం లేదుగా. అన్న, తమ్ముడు, తండ్రి, బాబాయి, మామయ్య, భర్త మంచివాడై వుంటే సరిపోతుందా?

భర్త మంచివాడై యుండీ కూడా, యితర బంధువులతో బాధలను అనుభవిస్తున్న వారెంతమందిని చూడటం లేదు? భర్త అయివుండి కూడా పట్టించుకోని భర్తల్ని ఎంతమందిని చూడటం లేదు?

చుట్టూ వున్న నిర్దాక్షిణ్యమైన స్త్రీ వ్యతిరేకమైన సాంఘిక, ఆర్థిక పరిస్థితులు, దోపిడీ అక్రమాలు, ప్రచార సాధనాల కట్టుకథలు..... కుటుంబంలో స్త్రీని పీడించే చిన్నచూపు చూసే సాంప్రదాయాలు, తల్లిని కొట్టే తండ్రులు, నాన్నమ్మ, అమ్మమ్మల్ని కొట్టే తాతయ్యలు, దుర్మార్గాలు.... యివన్నీ పురుషుల్ని స్త్రీలని హింసించే వారినిగా చేస్తాయి. వారిలో అహాలు రెచ్చగొట్టి వారిని దగాకోరులుగా మారుస్తాయి.

స్త్రీ పురుషులు స్నేహ, గౌరవాలతో ఆదరణగా జీవిస్తూ వుంటే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు కనుగొనగలరు. సంఘంలో వున్న చెడుని ప్రక్షాళనం చేయగలరు. ఒకరికి ఒకరు తోడునీడగా వుంటూ, ఎవరి ముందూ చేయిచాచకుండా, సంఘబలంతో, ప్రభుత్వ సాయంతో, స్వయంకృషితో అభివృద్ధిచెందగలరు. తమ సంతానానికి ఆదర్శమైన వ్యక్తిత్వాన్ని అందివ్వగలరు.

కానీ సంఘంలో ఎక్కడ చూసినా దొంగనీతులే. పురుషుడ్ని నాశనం చేసే, పురుషుడ్ని స్త్రీకి శత్రువుగా చేసే స్వార్థాలే, దుర్మార్గాలే, ప్రచారాలే, దురలవాట్లే చుట్టూతా. తనలో వున్న చెడుని కప్పి పెట్టుకోవడానికి పురుషుడు త్రాగుళ్లకీ, జూదాలకీ, ఖూనీలకీ, సిగరెట్లకీ, గొడవలకీ, భీభత్సాలకీ, దొంగతనాలకీ, పేకాటలకీ లోను అవుతాడు. 'ఇది కూడదు' అంటే అది అతడికి మరింత రోషం వస్తుంది. మరోప్రక్కన అతడి బ్రతుకే కాదు ఆలుబిడ్డల బ్రతుకు కూడా నాశనమైపోతుంది. వారి బ్రతుకు భద్రత కరువైపోతుంది. ఒక్క పురుషుడి అజ్ఞానం వల్ల కుటుంబానికి కుటుంబమే దిగజారిపోవడం ఎంత బాధాకరం?

పురుషుడేనా? స్త్రీలను పీడించే స్త్రీలు లేరా? అని చాలమంది ప్రశ్నించే అవకాశం ఉంది. తెలిసో తెలియకో స్త్రీ కూడా సాటి స్త్రీ పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తూ, పురుషుల దుర్మార్గాలకి సహకరిస్తూందీ అంటే దానిని ఆమె ఒక్కరి తప్పుగా చూడకూడదు. అది దుష్టసమాజ నీతిలో ఒక అంతర్భాగంగా చూడాలి. ఆ దుస్థితి నుంచి అటువంటి స్త్రీలు నిజాలు తెలుసుకుని బయటికి వచ్చేలా చేయాలి.

ఈ లోకంలో పాడైపోవడానికి ఎన్ని మార్గాలు వున్నాయో, బాగు అవడానికి అంతకు రెట్టింపు మార్గాలు వున్నాయి. బాగయ్యేందుకు కావలసిందల్లా ఎలా జీవిస్తున్నాము? ఎలా జీవించాలి? అన్న విజ్ఞత మాత్రమే. అటువంటి విజ్ఞత

ఆడవారందరిలోనూ వుంటుంది. బాధలు పడే స్త్రీకి మరింత ఎక్కువగా వుంటుంది. ఒక తల్లిలా, చెల్లిలా, స్నేహితురాలుగా, కన్నకూతురువలే ఆమె చేసే సేవలు పొందుతూ, మంచిదారినీ, మంచి భవిష్యత్తునూ చూపే విజ్ఞతకల స్త్రీ తనకు భార్యగా లభించడం పురుషుడు అదృష్టంగా భావించాలి. తనని నమ్ముకున్న ఆడది, తనవల్లే దిక్కులేనిదై పోతుందే అని అతడు జాలిపడాలి. తన పిల్లల భవిష్యత్తు బాగుంటే అది తమ సుఖానికే కదా! అనుకోవాలి. తానే విధంగా అపకారం చేస్తున్నాడో మనసుపెట్టి యోచిస్తే అతడికి తెలియదా?

భర్తతో సుఖంలేని స్త్రీకి పిల్లల్ని చక్కదిద్దుకునే సమయం వుండదు. భర్త గురించే ఆలోచిస్తూ, భర్త పెట్టే బాధలకి దుఃఖిస్తూ, భర్తలో మంచితనం కోసం ప్రాకులాడుతూ, పోరుపెడుతూ, ఏడుస్తూ వుండటమే జీవితం అయిపోగా ఆమెకి పిల్లల్ని ప్రేమగా లాలించి, ప్రపంచం అంటే ఏమిటో తెలియచెప్పే అనుకూల పరిస్థితులు వుండవు దాంతో పిల్లలు కూఢా దుష్టమార్గాలనే అవలంబిస్తారు.

ఏ స్త్రీ కూడా మొదట భర్తనూ, కుటుంబాన్ని బాగు చేసుకోకుండా పిల్లల్ని కూడా బాగు చేసుకోలేదు

కనుక ప్రతి స్త్రీ తన గౌరవం, కుటుంబ సంక్షేమం ఎరిగి, నయానోభయానో హింసలకి పాల్పడుతున్న భర్తనుగానీ, కొడుకునిగానీ యితర మగ బంధువులనుగానీ దారిలోకి తెచ్చుకునే చట్టం మన చేతిలోకి వచ్చింది అని సంతోషపడాలి. ఈ చట్టం గురించి భర్తతో, పిల్లలతో, కుటుంబంతో, యిరుగు పొరుగులతో చర్చించాలి. దీనిని గురించి మాట్లాడుకోవాలి.ఇది బాధిత స్త్రీలకు మాత్రమే సంబంధించిన విషయం అని ఎవరూ అనుకోకూడదు. ఇటువంటి పరిస్థితి మనకే రావచ్చుననీ, మన అక్క చెల్లెళ్లకీ రావచ్చునని ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడూ అనుకోవాలి. స్త్రీకి ఒక మంచి 'అన్న' వుంటే సరిపోదు, మంచి భర్త వుంటే సరిపోదు. ఆమె చుట్టూ వున్న ప్రతీ పురుషుడూ మంచివాడుగా వుండాలి. ఏ సాయం కావలసి వచ్చినా సోదరునిలా చేసేటట్టు వుండాలి. సంఘంగానీ, పురుషులుగానీ, న్యాయపరిపాలనా వ్యవస్థలు గానీ స్త్రీలకి అందించిన అండదండలు ఎన్నటికీ వృధాపోవు. అవి తిరిగి సమాజానికే గుణాత్మకంగా వుపయోగపడతాయి.

ప్రతి పురుషుడూ, ప్రతీ స్త్రీ, స్త్రీలకి చేయగల వున్నతమైన సేవ ఏమిటంటే ఆమెకు, 'అభయం వుంది, మనుషులు వున్నారు, యిటువంటి చట్టాలు వున్నాయి', అన్న అవగాహన కల్పించడమే.

లోకంలో స్త్రీ సమస్య అంటే అది స్త్రీలకు మాత్రమే సంబంధించిన సమస్య అని ఎవ్వరూ అనుకోకూడదు. లోకంలో వున్న సమస్యలన్నీ స్త్రీ సమస్యలతోనే ముడిపడి వున్నాయి. స్త్రీ సమస్యలతో సంబంధంలేకుండా ప్రపంచంలో ఏ సమస్యా లేదు. లోకంలో ఏ సమస్య వచ్చినా దాని దుష్ప్రభావం మొదట స్త్రీమీదనే పడుతుంది. మరి అటువంటప్పుడు స్త్రీకి సంబంధం లేని సమస్య అంటూ ఏమిటుంటుంది? స్త్రీ సమస్య అంటే అది ఖచ్చితంగా లోక సమస్యయే.

తన జీవితాన్ని గౌరవప్రదంగా తన కుటుంబాన్ని గౌరవప్రదమైన కుటుంబంగా తన జీవన విధానాన్ని లోక క్షేమకరంగా చేసుకునే హక్కు ప్రతీ స్త్రీకీ వుంది. అందుకామెకు పూర్తిగా సహకరించడమే మగవాడు ఆమెకూ లోకానికి చేయగల అత్యున్నత ధర్మకార్యం. ఇదే అతడు తాను జన్మవల్లా, బతుకువల్లా స్త్రీకి ఋణపడిన ఋణాన్ని తీర్చుకోగల మహదవకాశం.

రాక రాక మహిళలకు సంబంధించి, పోలీసు స్టేషన్ల చుట్టూ, లాయర్ల చుట్టూ తిరగకుండా, బాధ్యతలనే పుంజాలు తెంపుకుని దుష్టుగా తెగబడుతున్న పురుష పుంగవుల్ని అదుపులోపెట్టుకోగలిగే ఒకమంచి చట్టం వచ్చింది. ఈ చట్టం అమలులో, సంఘంలో గానీ, ప్రభుత్వ పరంగా గానీ ఏవో కొన్ని లోపాలు, ఆడ్డంకులు, సర్దుబాట్లు ఎదురుకావచ్చు. ఈ చట్టాన్ని వినియోగించుకునే వారిని బట్టే యీ చట్టం కూడా మరిన్ని మెరుగులు దిద్దుకుని, మరింత పదునెక్కుతుంది. స్త్రీలు పడే బాధలు చూస్తూ వుండి కూడా, ఆమెకి ధైర్యం కల్గించకుండా, యిటువంటి చట్టాల గురించి కనీస పరిజ్ఞానం యివ్వకుండా, ఆమె తరపున అవసరమైతే ఫిర్యాదు చేయకుండా, ఆమె కష్టాల్లోనే ఆమెను పడవేస్తే, మనకళ్లముందే ఆ మూగ తల్లి పిచ్చిదైపోతుంది. ఆహుతైపోతుంది. అన్యాయానికి గురి అయిపోతుంది. ఏ పాపం ఎరుగని పిల్లలు వీధుల పాలవుతారు. చదివించే వారూ, లాలన చేసే వారూ, వీధుల్లో చెత్తలేరుకునే వాళ్ళుగానో, బండి మెకానిక్‌లాగానో, వీధి అనాధ బాలురుగానో తయారై సంఘానికి భారమవుతారు. నేరస్థులయ్యే అవకాశం కూడా ఎక్కువే. స్త్రీని యింతలా హింసించిన భర్త 'సుఖపడతాడు, మరో పెళ్ళి చేసుకుంటాడు', అనుకోవచ్చు. చేసిన పాపం దహించుకుపోతూ వుండగా, ఎవరి అభిమానమూ పొందలేక, వాడూ అలాగే అణగారిపోతాడు; రెంటికీ చెడ్డ రేవడై బతుకుతూ నరకం అనుభవిస్తాడు. ఎంత మందిని చూడటం లేదు?

అదే యీ చట్టాన్ని వుపయోగించుకుని ముందుకు వెళ్తే, ఆ తరువాత తరువాత ఆ పురుషుడే తన తప్పు తెలుసుకుంటాడు. అతని కుటుంబం రక్షింపబడుతుంది. లోకం యొక్క ఆనందంలో తానూ భాగమవుతుంది. ఈ చట్టాన్ని గురించి తెలుసుకుని, పురుషుడే మారితే అంతకంటే కావలసిందేముంది?

కాబట్టి ప్రతీ ఒక్కరూ యీ గృహహింసా నిరోధ చట్టం 2005 గురించి తెలుసుకోవాలనీ, ప్రచారం చేయాలనీ, బాధిత స్త్రీలు యీ చట్టాన్ని ధైర్యంగా వుపయోగించుకుని తన జీవితాన్ని బాగు చేసుకోవాలని. అందుకామెకు అన్ని విధాలా అందరూ తమ సాయ సహకారాలు అందించాలని కోరుకుంటున్నాను.

ఈ చట్టం యొక్క రూపకల్పనలో, యీ చట్టాన్ని స్త్రీల మధ్యకు తీసుకెళ్లి వారి జీవితాలలో వెలుగులునింపడంలో కృషి చేస్తున్న అన్నదమ్ములకు, అక్క చెల్లెళ్లకూ, ప్రజాసంఘాలకూ, అమ్మలకూ నా నిండువందనాలు తెలియ చేసుకుంటున్నాను.

అమ్మల్లారా! అక్కల్లారా ! మీరంతా సంతోషంగా, ఆనందంగా వర్ధిల్లాలి, మీ సుఖ శాంతులలోనే అందరి సుఖ శాంతులున్నవి.

# మేలైన దంపతుల మేలిమి గుర్తులు

1. ఆ మేలిమి దంపతుల ప్రవర్తనలో సదా అన్యోన్యత కనిపిస్తుంది. ఇరువురి కిరువురూ ఎంతో గౌరవించుకుంటారు.ఆ యింట్లో ఆసేయ్, ఒసేయ్, లం, ముం, అనే పిలుపులు వుండవు. ప్రేమ, విశ్వాసం, క్రమశిక్షణ, బాధ్యత..... ఇవే వారి నైజంగా వుంటాయి.
2. ఇంటి పనుల్లో, భాగస్వామికి చెందిన పనుల్లో పరస్పరం సాయంగావుంటారు. 'ఇది నా పని - ఇది నీ పని' అన్న వాదవివాదములు, విభేదాలు వారిలో ఉండవు. నిందలు, అభియోగాలు, కుయుక్తులు వారి కుటుంబంలో మచ్చుకైనా కనిపించవు.
3. పరుల సొమ్ముకు ఆశపడరు. అన్యాయంగా అక్రమంగా వచ్చే సొమ్మని అంటరాని సొమ్ముగా భావిస్తారు. న్యాయంగా రావలసిన ఆస్తిపాస్తులేమైనా ఉంటే యిద్దరూ చర్చించుకొని, ఎవరినీ ఎవరూ నిందించుకోకుండా అవి పొందేందుకు కృషి చేస్తారు. ఈ విషయంలో ఆస్తిపాస్తుల కన్నా, భాగస్వామి సంతోషంగా వుండటమే మేలుగా చూసుకుంటారు.

4. వృధా ఖర్చులు చేయరు. బంధువులనూ, స్నేహితులనూ గౌరవించడానికి మొహర్బానీలకు పోరు. తమకు వున్నదే వారికి పెడతారు ఏది పెట్టాలన్నా తమ ఆదాయాన్ని బట్టీ, తాహతుని బట్టీ, బాధ్యతలను బట్టీ నిర్ణయిస్తారు ఏ విషయంలో అయినా యిద్దరిదీ ఒకటే మాట

5. ఎంతో అవసరమైతే తప్ప అప్పు చేయరు. అప్పు ఏ విధంగా తీర్చాలో ప్రణాళిక వేసుకుని ఆ ప్రకారంగా ఆ అప్పులు తీర్చి వేస్తారు పెద్దవారి పట్లా, పిల్లల పట్లా తమకు గల బాధ్యతల్ని సక్రమంగా నిర్వహిస్తారు.

6. ఏవైనా పొరపొచ్చాలు వుంటే మర్యాద పూర్వకంగా చర్చించుకుంటారు. రచ్చకెక్కడాన్ని అవమానకరంగా భావిస్తారు. తామే మారతారు. నేను లేకపోతే యీమె ఏమైపోతుందో, నేను లేకపోతే యితను ఏమైపోతాడో అని పరస్పరం కరుణ కలిగివుంటారు. జీవితంలో అద్వితీయమైన స్నేహితులవలె మెలగుతారు.

7. పరులదగ్గర జీవిత భాగస్వామి పట్ల కృతజ్ఞతనీ, గౌరవాన్నీ, ప్రేమాభిమానాల్ని వ్యక్తపరుస్తారు. తమ బాధలను దుఃఖాలను కోపాలు, అసహనాలూ ఏమున్నా వాటిని తమలో తామే పరిష్కరించుకుంటారు. ఇతరులకి వెళ్లబోసుకోవడాలు, రచ్చ చేసుకోవడాలు యివేవి వుండవు. ఒకరికొకరు 'గైడ్' లాగా వుంటారు. సహకారం అనేది వారికి నిత్య అలవాటుగా వుంటుంది. ఎవరు ఏ పని బాగా చేసినా నిండుగుండెతో అభినందించుతారు.

8. భాగస్వాములలో ఎవరో ఒకరి మంచి తనాన్ని మరొకరు అలుసుగా తీసుకుని, ఆడించే పరిస్థితులు, బాధించే పరిస్థితులు వారి మధ్య రావు. అలా వచ్చినపుడు వారు ఆ సమస్యని గుర్తించి, సంయమనంతో, బాధ్యతతో ఆ సమస్యకు పరిష్కారం కనుగొంటారు ఏ సమస్య వారికొచ్చినా, ఏ టెన్షన్ వచ్చినా అది పరిష్కారమవడం, తమ యిరువురి బాధ్యతగా భావిస్తారు. సమస్యకు పరిష్కారం మూడవ వ్యక్తి చేతుల్లోకి వెళ్లడం తమ దాంపత్యానికి అవమానకరంగా భావిస్తారు. కష్టమైనా, సుఖమైనా తామే పడాలని భావిస్తారు

9. దురభ్యాసాలు, దురలవాట్లు, (తాగుడు, జూదం, ఖూనీకోర్లు, విలాసాలు... హెచ్చు మాటలు, విర్రవీగుళ్లు వీటికి దూరంగా వుంటారు. భాగస్వాముల్లో ఎవరైనా దురలవాట్లకి లోనయివుంటే వాటిని మాన్పించేందుకు బాధ్యతగా కృషి చేస్తారు. అలా కృషి చేయడాన్ని తప్పు పట్టరు. దానికి రోషం పడరు.

10. తమ భాగస్వామితో కాకుండా వేరెవరితోనూ శారీరక సంబంధం పెట్టుకోరు. అలా పెట్టుకోవడాన్ని భాగస్వామిపట్ల, తన పట్ల తీవ్రమైన అపరాధంగా భావిస్తారు. వీరిని పొందడానికి, మభ్యపెట్టడానికి ఎవరైనా ప్రయత్నాలు చేస్తుంటే వారికి వీళ్లు ఎట్టి పరిస్థితులలోనూ లొంగరు. అటువంటి వారితో స్నేహాన్ని కట్ చేస్తారు.

11. భార్యా భర్తలలో, వారు దంపతులు కాక మునుపు తెలిపో తెలియకో ఎవరి జీవితంలో అయినా ఏదయినా తప్పు జరిగి ఉండవచ్చు. వాటిని వారు మరచిపోయేందుకు భాగస్వాములు ప్రయత్నిస్తారే గాని వాటిని తెలుసు కోవడానికి యిష్టపడరు. పట్టుబట్టరు. ఈ విషయంగా మనస్తాపాలు తెచ్చుకోరు సదా ఒకరిపట్ల ఒకరు సదభిప్రాయంతో,అనిర్వచనీయమైన ప్రేమతో జీవితాన్ని ఆనందమయంగా తీర్చిదిద్దుకుంటారు.

12. అనాగరికమైన తిట్లు తిట్టుకోవడం, ఒకరి బంధువులను మరొకరు తిట్టుకోవడం, హీన పరచడం, వెటకారం చేయడం చేయరు. తాము తమ పిల్లలు తప్ప మిగతా వారు ఎంత దగ్గర బంధువులు, స్నేహితులు అయినా, కుటుంబము యొక్క పర్సనల్ విషయాలలో వారిని పరాయిగానే భావిస్తారు. తమ యిద్దరు అంగీకరించిన మాటలే వారి దగ్గర మాట్లాడతారే గానీ, ఎవరి పక్షము వహించరు. ఎవరి గురించీ చెడ్డమాటలు చెప్పుకోరు. ఎవరిలో అయినా మంచినే గుర్తిస్తారు. చెడుని వదిలి పెట్టేస్తారు. ఏ సమస్యని అయినా భార్యా భర్తలు మొదట తమలో తామే చర్చించుకుంటూ వారిలో వారే పరిష్కరించుకుంటారు. గట్టి ఐక్యత సాధిస్తారు. ఇద్దరి అభిప్రాయాలూ ఒక్కటిగానే వుంటాయి.

13. దంపతులలో ఎవరికి యిష్టమైన వస్తువులు వారికి వుంటాయి. ఇష్టమైన దుస్తులు ఉంటాయి. ఇష్టమైన ఇంటి అమరికలు ఉంటాయి. వాటిని విమర్శించరు. ఆ వస్తువులను నిరాదరణ చేయరు. వాటిని తమకు అడ్డంగా భావించరు. అవి ఎట్లాంటివి అయినా తమ జీవిత భాగస్వామి యిష్టపడినవి కనుక వాటి పట్ల గౌరవం కలిగి ఉంటారు.

14. జీవిత భాగస్వామికి ప్రత్యేకంగా ధనం, బ్యాంకు బేలన్సు, ఉండాలని తలుస్తారు. అలా ఉండేందుకు, ఆ డబ్బులను వారు స్వేచ్ఛగా ఖర్చు పెట్టుకునేందుకు నిండు గుండెతో కృషి చేస్తారు. ఒకరికి ఒకరు ప్రేమతో మంచి

మాటలాడుకుంటూ, మెచ్చుకుంటూ, కానుకలందించు కుంటూ సంతోషంగా జీవిస్తారు

15. పిల్లల ముందు ఎప్పుడూ దెబ్బలాడుకోరు. పిల్లల సంరక్షణ, వారి చదువు, వారి భవిష్యత్తు ప్రణాళికలు, ఖర్చులు, దుస్తులు పట్ల ఎంతో మమకారంగా, బాధ్యతగా ఉంటారు. ముందు చూపుతో ఉంటారు

16. భర్తకు భార్య, భార్యకు భర్త ఆరోగ్య విషయంలో బాధ్యతగా, జాగ్రత్తగా ఉంటారు. కుటుంబానికి మంచి ఆహారం అందేలా చూస్తారు.

17. ఎక్కడికి వెళ్లినా, ఏ బంధువుల యిండ్లకి, ఏ పెళ్ళిళ్లకి, ఏ ఫంక్షన్స్‌కి, ఏ పరామర్శలకి, ఏ సభలకు వెళ్లినా యిరువురూ కలిసి వెళ్తారు. ఈ సందర్భంగా భాగస్వామికి ఎవరైనా అయిష్టతలు వుంటే అవి పోయేలా కృషి చేస్తారు తప్పితే, అందుకోసం బలవంత పెట్టరు.

18. తమ బాగు కొరకే కాకుండా, తమ చుట్టు ప్రక్కల వారు, తమ పిల్లల స్నేహితులు, లోకంలో ఇతరుల ఆయురారోగ్య విద్యా ఐశ్వర్య కీర్తులు అభివృద్ధి అవడానికి తమ వంతు సహకారాన్ని సంతోషంగా చేస్తారు, చేసేది మంచి పని అయినప్పుడు, భాగస్వామి అందుబాటులో లేకపోయినప్పటికీ కుటుంబ హద్దులకు లోబడి, భాగస్వామి అనుమతి లేకుండానే ఆ పనిని స్వేచ్ఛగా చేసి ఆ తరువాత భాగస్వామికి చెప్పి, ఆ చేసిన పనికి వారితో ఏకీభావాన్ని కుదుర్చుకుంటారు. ఆ నమ్మకం వారికుంటుంది. ఈ పద్ధతిని తప్పుగా భావించరు కూడా.

ఇటువంటి మేలైన, ఆదర్శవంతులైన దంపతులుగా వుండటం, మరీ అంత కష్టమైనవిషయమేమీ కాదు. ప్రేమ, గౌరవం, విశ్వాసం, తనకు అండ కావున ఆమెను, అతడిని, తాను శ్రద్ధగా చూసుకోవాలి, బాగా చూసుకోవాలి', అన్న భావన.. యీ నాలుగూ పెంపొందించుకుంటే ఎటువంటి వారైనా ఇటువంటి మేలైన దంపతులు కాగలుగుతారు. పిల్లా పాపలతో సంతోషంగా, సుఖంగా జీవిస్తారు. లోకానికి ఆదర్శవంతులవుతారు.

# రక్షణాధికారుల జాబితా

| జిల్లా | అధికారి పేరు | ఆఫీసు ఫోన్ నెం: | సెల్‌ఫోన్ నెం: |
|---|---|---|---|
| శ్రీకాకుళం | బి కనకదుర్గ గారు | 08942-221276 | 9440814582 |
| విజయనగరం | ఉషారాణి గారు | 08922-777985 | 9440814584 |
| విశాఖపట్నం | ఎ.ఇ. రాబర్ట్స్ గారు | 0891-2706156 | 9440814575 |
| తూర్పు గోదావరి | టి.వి. శ్రీనివాస్‌గారు | 0844-2368442 | 9440814682 |
| పశ్చిమ గోదావరి | బి.కృష్ణకుమారి గారు | 08812-242621 | 9440814587 |
| కృష్ణా | ఎం.జె. నిర్మలగారు | 0866-2493197 | 9440814461 |
| గుంటూరు | బి. రమాదేవి గారు | 0863-2234159 | 9440814511 |
| ప్రకాశం | ఎన్. విద్యావతి గారు | 08592-235304 | 9440814506 |
| నెల్లూరు | కె. రాఘవరావు గారు | 0861-2329481 | 9440814522 |
| చిత్తూరు | కె. లీలావతి గారు | 08572-234544 | 9440814496 |
| కడప | పి.వి. లక్ష్మయ్య గారు | 08562-244039 | 9440814489 |
| కర్నూలు | సుహాసిని దేవిగారు | 08518-277721 | 9440814589 |
| అనంతపురం | కె.ముత్యాలమ్మ గారు | 08554-232337 | 9440814471 |
| అదిలాబాద్ | జి. రాములు గారు | 08732-236630 | 9440814455<br>9441850348 |
| నిజామాబాద్ | పరుచూరి సరళకుమారి గారు | 08462-238109 | 9440814550 |
| కరీంనగర్ | ఎం. సూర్యకుమారిగారు | 0878-2254647 | 9440814450 |
| ఖమ్మం | ఎం. గ్రేస్ కుమారి గారు | 08742-255857 | 9440814441 |
| వరంగల్ | జె.ఎం.జె. కోమలిగారు | 0870-2550359 | 9440814433 |
| మహబూబ్‌నగర్ | వి. ఇందిర గారు | 08542-272778 | 9440814557 |
| నల్గొండ | వి. శారద గారు | 08682-245983 | 9440814566 |
| సంగారెడ్డి | వై. శైలజ గారు | 08455-276460 | 9440814544 |
| రంగారెడ్డి | కె. రాజ్యలక్ష్మి గారు | 040-23240023 | 9440814537 |
| హైదరాబాద్ | ఇ.వి. స్వర్ణలత గారు | 040-23202355 | 9440814531 |

వీరందరూ ఆయాజిల్లాల మహిళా, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి వసుధమిశ్రా జి.ఒ.ఎం ఎస్ నెం 22 (తేది: 09-11-2006) ద్వారా వీరిని ఆయాజిల్లాల రక్షణ అధికారులుగా నియమించారు

# ఆంధ్రప్రదేశ్‌లో గృహహింసా నిరోధ చట్టం 2005 అమలుపై

# ఒక చిన్న రిపోర్టు

ఆంధ్రప్రదేశ్‌లో, 'గృహహింసా నిరోధ చట్టం 2005' అమలు యొక్క తీరు చాలా ఆశాజనకంగా వుంది. రక్షణాధికారులు, న్యాయస్థానాలు తక్షణం స్పందిస్తున్నారు. ఆ ప్రాంతపు రాజకీయ, సాంస్కృతిక పరిస్థితుల వల్లనో ఏమో కొన్ని జిల్లాలలో ఈ చట్టం అమలు అనుకున్నంత ఆశాజనకంగా లేకపోయినప్పటికీ, మొత్తానికి అన్ని జిల్లాలను కలుపుకుని పరిశీలిస్తే చట్టం అమలు ప్రోత్సాహకరంగా ఉంది. బాధిత స్త్రీలకు మనోధైర్యం కల్గించేటట్టుగా వుంది. స్వచ్ఛంద సంస్థలు చాలా సహకరిస్తున్నాయి. చాలా కేసుల్లో మధ్యంతర ఉత్తర్వులిస్తున్నారు. రక్షణాధికారులు చాలా యాక్టివ్‌గా, చెప్పాలంటే అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. వారి విచారణ, కౌన్సిలింగ్‌లతోనే చాలా సమస్యలు పరిష్కారమవుతున్నాయి. మంచి ఒడంబడికకు వస్తున్నారు. కోర్టుల దాకా వెళ్లిన కొన్ని కేసుల్లో తీర్పులు కూడా వచ్చేశాయి. ఇది రికార్డే.

నవంబరు 9, 2006 నాడు ప్రభుత్వం యీ చట్టం అమలుకుగాను రక్షణాధికారులను నియమించినప్పటినుంచీ యిప్పటి మే 14, 2007 వరకూ ఆరునెలల కాలంలో, లభ్యం అయిన సమాచారం మేరకు కృష్ణాజిల్లాలో అత్యధికంగా 256 కేసులు నమోదు అయ్యాయి. న్యాయస్థానాలు 40 కేసుల్ని పరిష్కరించాయి. చాలామటుకు కౌన్సిలింగ్‌తోనే పరిష్కారం అవుతున్నాయి. ఆ తరువాత రంగారెడ్డి జిల్లాలో 98 కేసులు నమోదు అయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో న్యాయస్థానం 60 రోజుల్లోపలే తుది తీర్పు నందించిన మొదటి కేసు యీ జిల్లాదే. ఈ 98 కేసుల్లో 60 కేసులు రిజిష్టరు అయ్యాయి. మూడు కేసులకి తీర్పు కూడా వచ్చింది. నల్గొండ జిల్లాలో కూడా యించుమించు వంద కేసులు రక్షణాధికారి కౌన్సిలింగ్‌తోనే పరిష్కారం అయ్యాయి. వరంగల్ జిల్లాలో 70 కేసులు రిజిష్టరు అయితే 20 కేసులు పరిష్కారం అయ్యాయి. 20 కేసులు విచారణలో వున్నాయి. ఖమ్మం జిల్లాలో 47 కేసులు రిజిష్టరుకాగా 6 కేసులు పరిష్కారం అయ్యాయి. ప్రకాశం జిల్లాలో 27 కేసులు, నెల్లూరు జిల్లాలో 25 కేసులు, తూర్పు గోదావరి జిల్లాలో 14 కేసులు, పశ్చిమ గోదావరి జిల్లాలో 20 కేసులు,

విశాఖపట్నం జిల్లాలో 17 కేసులు, శ్రీకాకుళం జిల్లాలో 6 కేసులు, చిత్తూరు జిల్లాలో 10 కేసులు, ఆదిలాబాద్ జిల్లాలో 14 కేసులు, నిజామాబాద్ జిల్లాలో 15 కేసులు, కరీంనగర్ జిల్లాలో 11 కేసులు, సంగారెడ్డి జిల్లాలో 18 కేసులు రిజిష్టరు అయ్యాయి.

వీటిల్లో కొన్ని కోర్టుల పరిధిలో వుండగా, కొన్ని రక్షణాధికారుల విచారణలో వున్నాయి. చాలా జిల్లాల్లో రక్షణాధికారులు చేస్తున్న కృషి, సేవ ప్రశంసనీయం.

పరిశీలనలో సరాసరిగా వచ్చిన రిపోర్టు ఏమిటంటే ఈ గృహహింసా నిరోధ చట్టం 2005 రావడం వలన:

1. స్త్రీలలో, 'మా గురించి, మేము మగాళ్లతో పడుతున్న బాధలు, అన్యాయాలు, దుర్మార్గాల గురించి పట్టించుకుని, తమకు న్యాయం చేసే చట్టం వచ్చింది', అన్న ధైర్యం వచ్చింది.
2. స్త్రీలు, ప్రభుత్వం నియమించిన రక్షణాధికారులను నమ్ముతున్నారు. వారికి తాము పడుతున్న బాధల్ని, జరిగిన, జరుగుతున్నఅన్యాయాల్నిఅంతరంగిక విషయాలతో సహా చెప్పుకుంటున్నారు. రక్షణాధికారులు స్త్రీలు అయినప్పుడు ఈ కమ్యూనికేషన్ మరింత స్వేచ్ఛగా జరుగుతూంది.
3. కుటుంబాలలో పురుషులు స్త్రీలను పెడుతున్న బాధలూ, బెదిరింపులూ, మోసాలూ, అన్యాయాలూ నలుగురికీ స్పష్టంగా తెలుస్తున్నాయి. ఇటువంటి మోసాలు, దుర్మార్గాలూ కూడా జరుగుతున్నాయా? అని ఆశ్చర్యం, బాధా కల్గించేవే ఎక్కువగా వుంటున్నాయి.
4. బాధిత స్త్రీలకు తాత్కాలికంగా స్టేట్ హోమ్స్ వున్నచోట రక్షణ కల్పింప బడుతూంది.
5. స్వచ్ఛంద సంస్థలు చాలా శ్రద్ధగా ముందుకు వస్తున్నాయి.
6. అంగన్‌వాడీ, ఇందిరాక్రాంతీ కార్యకర్తలసేవలూ, పోలీస్ డిపార్ట్‌మెంట్ సేవలు కూడా ఉపయోగించుకొనడం జరుగుతూంది. వారు కూడా బాగా సహకరిస్తున్నారు.
7. న్యాయస్థానాలు న్యాయం జరిగేలా మధ్యంతర వుత్తర్వులనిస్తున్నాయి. బాధిత స్త్రీలకు ఈ చట్టం ఎంతో వుపయోగకరంగా వుంది.

అలాగే కొన్ని సూచనలు కూడా వెల్లడి అయ్యాయి. అవి :

1. కొన్ని కొన్ని కేసుల్లో బాధిత స్త్రీలు కట్టుబట్టలతో వస్తున్న పరిస్థితి వుంది. వారిని స్టేట్‌హోమ్స్‌లో చేర్పించేవరకూ కనీస సదుపాయాలు, రవాణా, దుస్తులు సమకూర్చవలసి వస్తుంది. రక్షణాధికారులకు కనీసంగా అయినా ప్రభుత్వంనుంచి ఫైనాన్షియల్ సపోర్ట్ వుంటే బాగుంటుంది
2. ఇంచుమించు అన్ని జిల్లాలలోనూ వుద్యోగులు లేరు. వున్నవారికే యీ పనులు అప్పచెప్తూ వుండటంతో వారికి పనివత్తిడితో పాటు అదనపు భారంగా కూడా వుంటుంది. సహాయ రక్షణాధికారుల్ని నియమిస్తామన్నారు గానీ, అది యింతవరకూ కార్యరూపం దాల్చలేదు. కనీసం సర్వీస్ ప్రొవైడర్స్ కూడా లేని పరిస్థితి కూడా వుంటూంది.
3. కొన్ని చోట్ల వాయిదాలమీద వాయిదాలు పడుతున్నాయి. మధ్యంతర వుత్తర్వులనివ్వడం, సమస్యని వీలైనంత త్వరలో పరిష్కరించడం జరిగితే స్త్రీ జాతికి ఎంతో మేలు జరుగుతుంది. చట్టం సద్వినియోగమవుతుంది.

ఈ చట్టం అమలుకు పై సమస్యలు కూడా పరిష్కారం అవడం చాలా అవసరం. ప్రభుత్వం సానుభూతితో ఈ పై విషయాల్ని పట్టించుకుంటుందని ఆశిద్దాం.

అలాగే.....

1. రక్షణాధికారులందరికీ ఈ చట్టాన్ని అమలు చేసే విషయంలో ప్రతీ ఆరునెలలకొకసారి, అప్పటివరకూ వచ్చిన కేసుల్ని సమీక్షిస్తూ, హైకోర్టు న్యాయమూర్తులు, శాంతాసిన్హావంటి స్వచ్ఛంద సంస్థల నాయకులు, సీనియర్ మహిళా జర్నలిస్టులతో ప్రత్యేక అధ్యయన తరగతుల్ని నిర్వహించడం బాగుంటుంది.
2. చట్టం అమలుకు బాగా కృషి చేసిన రక్షణ, సహాయ రక్షణాధికారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు, అభినందనలు అందివ్వడం ఎంతో బాగుంటుంది.
3. అలాగే ప్రతీ ఆరునెలలకూ రక్షణాధికారుల ఆఫీసుల సెల్‌ఫోన్ నంబర్లు పత్రికలకు విడుదల చేయడం, పత్రికా ప్రకటనలివ్వడం ఎంతో మంచిది. ఇవన్నీ తప్పక జరుగుతాయని ఆశిద్దాం.

## కొన్ని అభిప్రాయాలు

భార్యని గుర్తించడం అత్తగారికి యిష్టం వుండదు అన్న మాటలో నిజం లేదు. అర్థం చేసుకునే మనస్తత్వం వున్న దంపతులు చిన్నచిన్న విషయాలకు పట్టింపు యివ్వకుండా, పంతాలు -పట్టింపులకు పోకుండా ఎవరికీ నొప్పి కలగకుండా కుటుంబంలో సఖ్యత తీసుకు వస్తారు.

స్త్రీలని గౌరవించని ఆదర్శం - అది పెద్ద అబద్ధం.

స్త్రీకి చదువు నిరాకరించడం అంటే రేపటి సంఘానికి అపకారం చేయడమే. తమ పిల్లలకూ, తమకూ మంచి భవిష్యత్తు లేకుండా చేసుకోవడమే.

స్త్రీకి వైద్యాన్ని నిరాకరించేవాళ్ళు మహాపాపం చేసుకుంటున్నారు. బతికున్నంత కాలం వారిని యీ పాపం వెన్నాడుతూనే వుంటుంది.

స్త్రీ ధనం ఆశించడం అంటే దొంగతనానికి పాల్పడినట్టే. తన ధనాన్ని, ఆస్తుల్ని ఇవ్వక తప్పని పరిస్థితులు స్త్రీకి కల్పించడమంటే, ఆమె హక్కుల్ని ఉల్లంఘించినట్టే.

సంఘంలో యితరులను కొట్టడం, తిట్టడం, హింసించడం ఏ విధంగా నేరాలో, స్త్రీని కొట్టడం, తిట్టడం, హింసించడం కూడా అటువంటి నేరాలే. స్త్రీ తనని కొడుతున్నట్టు, తిడుతున్నట్టు, హింసిస్తున్నట్లు, ఎవరికీ చెప్పుకోదు కాబట్టి, ఆమె పట్ల అటువంటి అఘాయిత్యాలు చేయడం అంటే అది నేరమే కాదు, పాపం కూడా.

స్త్రీని చూసినప్పుడు ఏ పురుషుడికి అయినా అమ్మ, పిన్ని, అక్క, చెల్లి, సోదరి, గౌరవనీయమైన వ్యక్తి....... యిటువంటి భావనలే రావాలి. అలా కాకుండా అతడికి వారు సెక్సు బొమ్మలుగా కనిపిస్తే అతడిలో మానసిక రోగి ఉన్నట్టే. అటువంటి మానసిక రోగాన్నుండి అతడు సత్వరం బయటపడాలి.

స్త్రీల గురించి లేనిపోని మాటలు చెప్తూ, వారి మీద అబద్ధపు ప్రచారాలు చేసేవాడు, స్త్రీలకే కాదు సంఘానికే విషప్పురుగు. లోకానికే అతడు చెడబుట్టినవాడు.

స్త్రీ లేకుండా బ్రతకగలను అనుకునేవాడు. జీవితంలో ఏదీ సాధించలేడు. ఒంటరివాళ్లయిపోతారు. బాధలు పడుతున్నప్పుడు వాళ్లకు అమ్మే తలపుకు వస్తుంది.

స్త్రీని ద్వేషించి ఎవరైనా ఏమి సాధిస్తారు? పగిలిపోయిన కుండ పెంకు ఎందుకు పనికి వస్తుంది?

చదువుకున్న స్త్రీ చల్లని తల్లి, ఉద్యోగం చేసే స్త్రీ యింటికి రక్ష.

మగవాడికైనా, స్త్రీకి అయినా జన్మనిచ్చేది, శ్వాసనిచ్చేది స్త్రీయే. స్త్రీయే లేకపోతే మగవాడి పుట్టుకేది? బ్రతుకు ఏది?

స్త్రీకి స్త్రీయే శత్రువు అన్నమాట అరిగిపోయిన పాత రికార్డు. స్త్రీకి శత్రువులెందుకు వుండాలి? ఒకవేళ స్త్రీయే, స్త్రీకి శత్రువుగా వుంటున్నపుడు, పురుషుడా నీవు మిత్రునిగా వుండవచ్చుకదా! స్త్రీకి స్త్రీయే ద్వేషిగా ఉండటం, దుష్ట పెత్తనం చలాయించడానికి పురుషుడికి



99911

అదొక సౌలభ్యం. ఈ సంగతి తెలుస్తూవుండటం వల్లనే యిప్పుడు స్త్రీలకి స్త్రీలే మొట్టమొదటి మిత్రులవుతున్నారు.

అయినదానికీ కానిదానికీ ఆడవాళ్లపై పడి ఏడుస్తూ ఉండేవాళ్ళు సంఘంలో కాస్తంత ఎక్కువమందే కనిపిస్తూ ఉంటారు. సోదె చెప్పే ఆవిడకూడా వాళ్ల గురించి తన సోదెలో చెప్పదు.

చదువులో, బాధ్యతల్లో, జీవన కృషిలో, పోరాటంలో స్త్రీని కలుపుకుని ముందుకు వెళ్లేవాడే విజయుడవుతాడు. తాను సుఖపడి లోకానికి సంతోషాలు పంచగలుగుతాడు. ఒకరికొకరు తోడై వుంటే బ్రతుకు నందనవనం. నీవు-నేను, నీది-నాది అనుకుంటే ప్రతీ నిముషం చేదు విషం.

స్త్రీ హీనురాలు అని చెప్పేవాడు. తానూ స్త్రీకే పుట్టినందువల్ల పరోక్షంగా తానూ హీనుడే, తనదీ హీన జన్మే అని చెప్పుకుంటున్నాడు.

న్యాయం ఎప్పుడూ ఒక్కటే. ఆడదానికో న్యాయం, మగాడికో న్యాయం ఎప్పుడూ వుండదు. అది చెల్లదు కూడా.

భార్యా భర్తలు ఒకరిని మించి మరొకరు చదువుకోవాలని సంపాదనపరు లవ్వాలని కోరుకునేటట్లయితే అందుకు స్నేహపూర్వకంగా కృషిచేసేట ట్లయితే, వారు లోకానికి చాలా మేలు చేస్తారు, ఆదర్శవంతులవుతారు.

దేనిలో అయినా స్త్రీకే ప్రథమ అవకాశం యిచ్చేవాడు ఎప్పుడూ ప్రథమ, ద్వితీయ శ్రేణిలో వుంటాడు. నేనే మొదట వుండాలి, ఆడవాళ్ళు చిట్టచివరి స్థానంలో వుండాలని తలంచేవాళ్లకి ఆ చిట్టచివరి స్థానం కూడా దక్కకపోవచ్చు అటువంటి వాళ్ళు బయటికి గెంటివేయబడ వచ్చుకూడ.

స్త్రీకి వ్యతిరేకమైన సాహిత్యాన్ని, ప్రచార సాధనాల దుష్ప్రచారాన్ని ప్రతీ ఒక్కరూ తిప్పికొట్టాలి. అటువంటివి స్త్రీకే కాదు, సంఘానికి కూడా అవమానం.



డి. నటరాజ్
పుట్టింది 16.7.1956
ఉద్యోగం డిప్యూటి రిజిస్ట్రార్
ఆంధ్రా యూనివర్సిటీ
భార్య సుజాత, కొడుకు సుజన్

డి. నటరాజ్, తన రచనలు **మరపురానిపాప, గౌతమబుద్ధుడు, పొగత్రాగే మిత్రునికి లేఖ , 'సర్వలోకహితం - బుద్ధుని ధర్మం, గొర్లకాపరి వలె మీరు కూడ** పుస్తకాల ద్వారా తెలుగునాట చాలామందికి పరిచయమే.

బుద్ధధర్మం, పర్యావరణ రక్షణ, స్త్రీ ఉద్యమం, దళిత బహుజన మైనారిటీల సంస్కృతి యివి అతడికి చాలా యిష్టమైన విషయాలు. అన్నింటికంటే చెట్లునాటడం, పిల్లలతో మెలగడం, కథలు రాయడం తనకు చాలా ఆనందం కల్గిస్తాయి అంటాడు. బుద్ధధర్మం వల్లనే తన జీవితానికి నిజమైన వికాసం కల్గింది అంటాడు.

**బోధిసత్వ పుస్తకమాల**

విశాఖపట్నం-3